సుబ్రమణ్యం హత్య కేసులో

సిసి ఫుటేజీలో ఉన్నవారి పేర్లేవీ?

- పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 17 | విజయవాడ, గురువారం 17 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 17 August 2023 | Rs

వడివడిగా జాబిల్లి చెంతకు..!

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రయాన్ 3 జాబిల్లికి మరింత చేరువైంది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండింగ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్) చంద్రయాన్ 3 కక్ష్యను బుధవారం ఉదయం 8.30 గంటలకు కుదించి చివరిదైన 5వ కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని ఇస్రో తెలిపింది. 'జాబిల్లి దిశగా ఇక ఒక అడుగే దూరం..చంద్రుని చుట్టూ చక్కర్లు కొట్టేందుకు ఇదే చివరి కక్ష్య. 153 కిమీ క్ష్మీ 163 కిమీ క్షక్ష్యలోకి వ్యోమనౌక ప్రవేశించింది. దీంతో చంద్రుని చేరేందుకు అవసరమైన విన్యాసాలు పూర్తయ్యాయి. ఇక ల్యాండ్ అవ్వడమే మిగిలింది' అని ఇస్రో బుధవారం తెలిపింది. చంద్రయాన్ 3 వ్యోమనౌకలో ల్యాండర్ మాడ్యూల్ (ఎల్‌ఎం), ప్రొపల్షన్ మాడ్యూల్ (పిఎం), రోవర్ వున్నాయి. ఈ నెల 17న పిఎం నుంచి ఎల్‌ఎం విడిపడి ప్రయాణాన్ని సాగిస్తాయని ఇస్రో పేర్కొంది. అన్నీ సజావుగా సాగితే చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు చంద్రయాన్ మోసుకెళ్లిన రోవర్ పరుగులు తీయనుందని తెలిపింది. గత జులై నెల 14వ తేదీన శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్ 3ని నింగిలోకి పంపిన సంగతి తెలిసిందే.

7 రైల్వే ప్రాజెక్టులకు ఓకే

- రూ.32,500 కోట్లతో 2,339 కి.మీ మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరణ
- పట్టణాల్లో 10 వేల ఇ-బస్సులు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైల్వే లైన్ల విస్తరణ, రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించడం, రద్దీని తగ్గించడం కోసం ఏడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులను రూ.32,500 కోట్ల అంచనా వ్యయంతో అమలు చేయనుంది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు అనురాగ్ ఠాకూర్, అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు.

ఏడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఒరిస్సా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని 35 జిల్లాల పరిధిలో ప్రస్తుతమున్న రైల్వే నెట్‌వర్క్‌ను 2,339 కిలో మీటర్ల మేర విస్తరించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ పనులతో ఆయా రాష్ట్రాల్లోని కార్మికులకు 7.06 కోట్ల పనిదినాల వరకూ ఉపాధి అవకాశాలు అందుతాయని తెలిపారు. ప్రధానంగా గుంటూరు- బీబీ నగర్ మధ్య 239 కిలో మీటర్ల రైల్వే లైన్ డబ్లింగ్ కు ఆమోదం తెలిపిన కేంద్రం.. ఇందుకోసం రూ.3,238 కోట్లు ఖర్చు చేయనుంది. దీంతో హైదరాబాద్ - చెన్నై మధ్య 76 కిలో మీటర్ల దూరం తగ్గనుంది. మరోవైపు ముద్ఖేడ్ - మేడ్చల్, మహబూబ్ నగర్ - డోన్ మధ్య రైల్వే లైన్ డబ్లింగ్ కు ఆమోదం లభించింది. దీనివల్ల హైదరాబాద్- బెంగళూరు మధ్య 50 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం నుంచి ఖుర్దా రోడ్ మీదుగా నెర్గుండి వరకు మూడో రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. అలాగే విశాఖపట్నం - చెన్నై మధ్య మూడో రైల్వే లైన్ డిపిఆర్ సిద్ధం కాగా.. మూడు వేల కోట్ల ఖర్చుతో నిర్మాణ పనులు జరగనున్నాయి.

పిఎం ఈ-బస్ సేవ కింద 10 వేల ఈ-బస్సులు

పట్టణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేలా 'పిఎం ఈ-బస్ సేవ' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 10 వేల ఇ-బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో 169 పట్టణాల్లో ఈ బస్సులను నడపనున్నట్లు అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ఇందుకోసం రూ.57,613 మిగతా 7లో

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న మోడీ

'విశ్వకర్మ'కు రూ.13 వేల కోట్లు

మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన విశ్వకర్మ పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా చేతి వృత్తుల వారికి రాయితీపై రుణాలు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 'గరిష్ఠంగా 5 శాతం వడ్డీరేటుతో లక్ష రూపాయిల వరకు ఈ రుణాలు పొందవచ్చు. ఇందుకోసం రూ.13 వేల కోట్లను కేంద్రం వెచ్చించనుంది" అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తొలి విడత రుణం సద్వినియోగం చేసుకుంటే రెండో విడత కింద రూ. 2 లక్షల రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంతో ఒబిసి సామాజిక తరగతికి చెందిన సంప్రదాయ కళాకారులు, చేనేతకారులు, స్వర్ణకారులు, వడ్రంగులు, రజకులు, క్షురకులు, పడవల తయారీదారులు, తదితర వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

నకిలీ వేలిముద్రలతో రూ.5.9 కోట్లు కాజేత

- ఐదుగురు సైబర్ మోసగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి- కడప అర్బన్

నకిలీ వేలిముద్రలతో ఖాతాదారులకు తెలియకుండా వారి ఖాతా నుంచి నగదును డ్రా చేసిన ఐదుగురు అంతర్ జిల్లా సైబర్ మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నకిలీ వేలిముద్రలు తయారు చేసే సామగ్రిని, కారును స్వాధీనం చేసుకున్నారు. వారిని మీడియా ఎదుట హాజరుపర్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించి ఎస్‌పి అన్బురాజన్ తెలిపిన వివరాల ప్రకారం... ఆధార్ ఆధారిత సమాచార దుర్వినియోగం కేసులో ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన నల్లగళ్ల వెంకటేష్, మళ్ల అజయ్, గంట కల్యాణ్, షేక్ జానీ, పుసుపులేటి గోపిలను పోలీసులు అరెస్టు చేశారు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం ద్వారా నిందితులు రూ.5.9 కోట్ల కాజేశారు. వెబ్‌సైట్ల ద్వారా డాక్యుమెంట్లను సేకరించి వాటిలోని వేలిముద్రలను నకిలీవి తయారు చేసేవారు. బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు మాయమవుతుండడంపై వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఎఎస్‌పి తుషార డూడి ప్రత్యేక బృందం అనుమానిత నంబరును ట్రాక్ చేసి కడప పాత బైపాస్ వద్ద నిందితులను అరెస్టు చేసింది. వారిపై ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు, 412 ఎన్‌సిఆర్‌పి పిటిషన్లు నమోదయ్యాయి. వారికి సంబంధించిన 12 అకౌంట్లను సీజ్ చేసి ఇడికి పంపనున్నామని ఎస్‌పి తెలిపారు. వారు వినియోగించిన సమాచార వెబ్‌సైట్ల మూసివేతకు సిఫారసు చేయనున్నట్లు చెప్పారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌పి కోరారు.

కటాఫ్ 2014 జూన్ 2

- ఆలోపు ఉంటే క్రమబద్ధీకరణ
- కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం నిర్ణయం!
- త్వరలో ఉత్తర్వులంటున్న ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా చేరిన వారిని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని గతంలో రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ 2 కంటే ముందు నియమించబడి ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగస్టు 15న సంతకం చేశారని ఉద్యోగ సంఘాలు బుధవారం తెలిపాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ సంబంధిత అధికారుల నుంచి గానీ ఎటువంటి అధికారిక ఉత్తర్వులు, ప్రకటనలు రాలేదు. రెగ్యులర్‌పై ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు విధిస్తుందో వేచిచూడాల్సి ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లోనే సుమారు లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది.

ఈ నిర్ణయం ప్రకారం 6,667 మంది అర్హులని ప్రభుత్వం తేల్చింది. ఇప్పుడు ఐదేళ్ల నిబంధనను రద్దు చేయడంతో సుమారు మరో 4 వేల మందికి అవకాశం లభిస్తుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. వీలైనంత ఎక్కువమందిని రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకపోయినా స్వయంగా ముఖ్యమంత్రి ఐదేళ్ల నిబంధన తొలగించారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సిఎం ఆగస్టు 15న సంతకం చేశారని వెల్లడించారు. 4-5 రోజుల్లో ఉత్తర్వులు కూడా వెలువడతాయని అన్నారు. కాగా రాష్ట్ర మంత్రిమండలి గతంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం ఉండదని, తాము ప్రభుత్వానికి పలుసార్లు ప్రతిపాదనలు అందించామని ఏపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మరో ప్రకటన చేయడం గమనార్హం.

కటాఫ్ 2022 డిసెంబర్ తీసుకోవాలి

2022 డిసెంబరు నాటికి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలంగాణ తరహా 2014 జూన్ 2వ తేదీ నాటికి పనిచేస్తున్నవారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఒక్కటేనని, అందర్నీ రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగి ఎన్నేళ్ల సర్వీస్ పూర్తయితే రెగ్యులర్ చేస్తారో నిర్దిష్టమైన ఉత్తర్వులు, కటాఫ్ నిర్ణయించాలని తెలిపారు.

కుదిరిన 'విద్యుత్' పిఆర్‌సి

- అగ్రిమెంట్‌పై జెఎసి, యాజమాన్యం సంతకాలు
- కాంట్రాక్టు ఉద్యోగులకు నిరాశ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య వేతన సవరణ ఒప్పంద (పిఆర్‌సి) అగ్రిమెంట్ కుదిరింది. ప్రభుత్వం ప్రతిపాదించిన పేస్కేల్‌ను ఆమోదిస్తూ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సంతకాలు చేశారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో విద్యుత్ సౌధలో బుధవారం రాత్రి వరకు చర్చలు జరిగాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన సింగిల్ మాస్టర్ పేస్కేల్‌కు ఆమోదం తెలుపుతూ జెఎసి నాయకులు సంతకాలు చేశారు. ఫిట్‌మెంట్ 8 శాతానికి ఒప్పుకున్నారు. పెన్షనర్లు, వారి కుటుంబాలకు కూడా ఫిట్‌మెంట్ వర్తిస్తుంది. పిఆర్‌సి బెనిఫిట్స్, సవరించిన వేతనం 2022 ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్నాయి. జెఎసి నాయకులు ప్రతిపాదించిన పాత ఇంక్రిమెంట్లకు ప్రభుత్వం ఒప్పుకుంది. పేస్కేల్‌లో అనామలీస్ ఉంటే సరిచేసేందుకు ట్రాన్స్‌కో జెఎమ్‌డి నేతృత్వంలోని మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిలతో హెచ్‌ఆర్ కమిటీ ఏర్పాటు చేస్తామని విజయానంద్ ప్రకటించారు.

విజయవాడలోని విద్యుత్‌సౌధ

బుధవారం జరిగిన ఒప్పంద పత్రాలపై జెన్‌కో ఎమ్‌డి చక్రధర్‌బాబు, డైరెక్టర్ సయ్యద్ రఫీ, ట్రాన్స్‌కో జెఎమ్‌డి మల్లారెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ వీరభద్రారెడ్డి, సిపిడిసిఎల్ సిఎమ్‌డి పద్మ జనార్ధన్‌రెడ్డి, ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి సంతోష్‌రావు, ఉద్యోగ సంఘాల తరపున జెఎసి ఛైర్మన్ చంద్రశేఖర్, కన్వీనర్ సాయికృష్ణ, వైఎస్ఆర్‌టిఎఫ్ నుంచి మహేశ్వరరెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు కిరణ్ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు 2018 పిఆర్‌సి

కొత్త పిఆర్‌సి ఒప్పందంలో కాంట్రాక్టు ఉద్యోగులకు నిరాశ మిగిలింది. విద్యుత్ సంస్థల్లో సుమారు 60వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 30వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు. ఏదైనా పిఆర్‌సిని అమలు చేసే సమయంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు వీరికి కూడా కొంత పెంచి రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేసారి అమలు చేస్తాయి. అయితే ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి వేతన పెంపు చేయలేదు. 2018 పిఆర్‌సి అంటే పాత వేతనంపై కేవలం 2 శాతం మాత్రమే పెంచింది. పెంచిన వేతనాన్ని కూడా పిఆర్‌సి అమలు తేదీ 2022 ఏప్రిల్ 1 నుంచి కాకుండా ఆగస్టు నుంచి పెంచుతామని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఒప్పందానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ మధ్య జరిగిన పిఆర్‌సి ఒప్పందానికి వ్యతిరేకంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సంతకాల సేకరణ చేపట్టనుంది. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఈ ఒప్పందం జరిగిందని, ఇది తప్పుడు వేతన ఒప్పందమని స్ట్రగుల్ కమిటీ భావిస్తోంది. దీనిని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి సంతకాల సేకరణ చేపడుతుంది. అనంతరం ఈ సంతకాలను కార్మిక శాఖకు అందించనుంది. ప్రస్తుత పిఆర్‌సిపై అన్ని తరగతుల ఉద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. కొత్త వేతనం అమలు చేస్తే వేతనాలు పెరగాలని, కానీ ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సి ఇచ్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతకాల సేకరణతో పాటు చలో విజయవాడ కార్యక్రమాన్ని కూడా స్ట్రగుల్ కమిటీ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

లింగ వివక్ష చూపే మూసపదాలు వాడొద్దు!

- హ్యాండ్ బుక్‌ను విడుదలజేస్తూ సుప్రీం చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ : లింగ వివక్ష చూపే పదాలను కోర్టు భాష నుంచి తొలగిస్తూ, ప్రత్యామ్నాయ పదాలతో కూడిన హ్యాండ్‌బుక్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి డి వై చంద్రచూడ్ బుధవారం ఆవిష్కరించారు. కోర్టు తీర్పుల్లో, వాద ప్రతివాదాల్లో వాడే భాష లింగ తటస్థంగా ఉండాలని ఆయన సూచించారు. మంచి సంకల్పం వ్యక్తం చేస్తే చాలదు, మంచి పదాలను కూడా వాడాలి అని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. లింగ వివక్ష చూపే పడికట్టు పదాలను పక్కన పెట్టి ప్రత్యామ్నాయ పదాలను వాడేలా చూడడం కోసమే ఈ హ్యాండ్ బుక్ తెచ్చామని ఆయన తెలిపారు.ం రాజ్యాంగం లింగ భేదం లేకుండా అందరికీ సమాన హక్కులకు హామీ ఇచ్చిందని అన్నారు. మహిళ పురుషుడికి లోబడి ఉండక్కర్లేదు, ఎవరికీ లొంగిఉండాల్సిన అవసరమూ లేదు అని ఆయన ఉద్ఘాటించారు. మహిళలు చేసే జీతం లేదని శ్రమ కుటుంబ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, ద్రవ్య పొదుపులో చాలా కీలకమని అన్నారు. మహిళలు మితిమీరిన భావోద్వేగానికి మిగతా 6లో

నిధుల కొరత రాకూడదు

- ఆర్థిక పరిస్థితిపై సమీక్షలో సిఎం ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాకు నిధుల కొరత ఎటువంటి పరిస్థితుల్లోనూ రాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వివిధ ఆదాయ వనరుల శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల కొరత రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వస్తున్న ఆదాయం, పలు కార్యక్రమాలకు చేస్తున్న వ్యయంపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వాణిజ్య పన్నుల శాఖ, మద్యం శాఖల ద్వారా వచ్చే ఆదాయంపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు నిధుల కొరత రాకుండా చూడటానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సిఎం సూచించారు. ఇది ఎన్నికల ఏడాదన్న అంశాన్ని కూడా ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవాలని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు పూర్తయిన సందర్భంగా ఆదాయ, వ్యయాలపై కూడా అధికారులు కూడా ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేంద్రం ద్వారా వస్తున్న నిధులు, రిజర్వ్‌బ్యాంకు నుంచి ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన రుణాలు కలిపి మొత్తం ఆదాయ పరిస్థితులను వివరించారు. అయితే ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉన్నట్లు లెక్కలు తేలాయని సమాచారం. ఈ లోటును ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ ద్వారా భర్తీ చేస్తామని అధికారులు చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంలో సైతం ఎన్నికల ఏడాది అంశాన్ని సిఎం ప్రస్తావించినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చాలని చెప్పారు. . ఇదే సమయంలో మద్యం అమ్మకాలు, తద్వారా సమకూరుతున్న ఆదాయంపైనా ఆ శాఖ అధికారులు వివరించారు. మద్యం అమ్మకాలు తగ్గినట్లు తేలినా, ఆదాయం మాత్రం పెరిగిందని అబ్కారీ అధికారులు వివరించారు.కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై కూడా ముఖ్యమంత్రి వాకబు చేసినట్లు తెలిసింది. ఏయే పథకాలకు ఎంత రావాల్సి ఉంది, అందులో ఇప్పటివరకు వచ్చిన నిధులు ఎంత అన్నది ఆర్థిక శాఖ అధికారులు వివరించారు. ఇంకా రావాల్సిన నిధులపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ భేటీలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువతకు 40శాతం సీట్లు : లోకేష్

- టిడిపి గెలిస్తే పెట్టుబడుల వరద!
- వందరోజుల్లోనే విశాఖకు ఐటి కంపెనీలు వస్తాయి

2



ఆటోను ఢీకొన్న లారీ..

- ఆరుగురు దుర్మరణం

7

టిడిపి 2047 విజన్ వినాశకరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ విశాఖలో ప్రకటించిన విజన్ 2047 వినాశకరమైందని, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేది కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం విజయవాడలో ఆ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని ఎండగట్టారు. విజన్ 2020 తర్వాత వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరిగాయని అయినా పాలకులు పాఠం నేర్చుకోవడం లేదని తెలిపారు. విజన్ 2047ని కొత్త సీసాలో పాత సారాగా ఆయన అభివర్ణించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు జరపకుండా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తూ రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తుంటే వైసిపి, టిడిపిలు బిజెపిని ఎలా బలపరుస్తున్నాయని ప్రశ్నించారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానంటూ వాగ్దానాలు చేసే చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయాలని, విద్యాసంస్థలను కుదించాలని, విద్యుత్ సంస్కరణలను కొనసాగించాలని తన విజన్ 2047లో చెప్పడం ప్రజా ప్రయోజనాలకు, రాష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. పి4 విధానంలో ప్రజల పాత్ర ఒక భ్రమ అని, సహజ వనరులను దోచుకోవడానికే పి4 విధానం తోడ్పడుతుందని విమర్శించారు. వైసిపి విధానాలు రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీశాయని, దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెబుతున్న చంద్రబాబు నాయుడు గత విధానాలనే అనుసరించడం, అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో చెప్పాలన్నారు. బిజెపి కేంద్రంలో అనుసరించే విధానాలనే రాష్ట్రంలో వైసిపి అనుసరిస్తున్నదని, ఈ రెండు విధానాలకు తెలుగుదేశం పార్టీ ప్రకటించిన విజన్‌కు ఏ మాత్రమూ భిన్నం కాదని అన్నారు. గతం నుండి పాఠాలు నేర్చుకోకుండా, పాచిపోయిన పాత విధానాలనే అమలు చేసి రాష్ట్రాన్ని సుడిగుండంలోకి నెట్టొద్దని, టిడిపి తన విధానాలపై పునరాలోచన చేసి రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, యువతరం భవిష్యత్‌కి తోడ్పడే ప్రత్యామ్నాయ విధానాలు తీసుకోవాలని, ప్రపంచంలో మారుతున్న కొత్త పరిస్థితులను అధ్యయనం చేయాలని శ్రీనివాసరావు సూచించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపిని మట్టి కరిపించాలని, బిజెపిని ప్రత్యక్షంగా, పరోక్షంగా బలపరిచే మిత్రులకు కూడా మద్దతు ఇవ్వొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సిపిఎం ప్రజా పునాదిని విస్తరించుకోవడానికి, పార్టీ బలపడటానికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మణిపూర్‌లో... రేపు ఎక్కడైనా...

- బిజెపి విచ్ఛిన్నకర రాజకీయాలపై బృందా కరత్, మరియం ధావలే వ్యాఖ్య
- బాధితులకేదీ సాయం?
- ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తక్షణమే తొలగించాలి
- గవర్నర్ ఆందోళన సముచితమే
- రాష్ట్రపతిని కలిసేందుకు సమయం కోరాం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈరోజు మణిపూర్‌లో జరిగింది, రేపు దేశంలో మరెక్కడైనా పునరావృతం కావచ్చని ఐద్వా ప్యాట్రన్ బృందా కరత్, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పేర్కొన్నారు. మణిపూర్ హింసాకాండ కారణంగా ఉద్యోగాలు, ఆదాయాన్ని కోల్పోయిన వారికి తక్షణమే ఆహారం, ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9 నుంచి 11 వరకు మణిపూర్ లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఐద్వా బృందం బుధవారం నాడిక్కడ పండిట్ రవి శంకర్ శుక్లా మార్గ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మణిపూర్‌లో మే 3 నుంచి సామాన్య ప్రజల జీవనం స్తంభించిపోయిందని, భౌగోళికంగా, మానసికంగా మణిపూర్ రెండుగా విభజించబడిందని అన్నారు. ఎవరూ పనికి వెళ్లలేరని, బియ్యం ధర విపరీతంగా పెరిగిపోయిందని తెలిపారు. చాలా కుటుంబాలకు ఒక పూట మాత్రమే భోజనం ఉంటుందని, అందరికీ 10 కిలోల ధాన్యం, ఇతర ఆహార పదార్థాలు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఆధార్ అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శాంతికి అతిపెద్ద అవరోధం న్యాయం నిరాకరించడమని, న్యాయపాలనకు ప్రధాన అడ్డంకి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అని విమర్శించారు. క్రూరమైన హింసకు గురైన మహిళలు అన్నీ మరిచిపోయి క్షమించాలని నిస్సిగ్గుగా ఆయన అంటున్నారని దుయ్యబట్టారు. కులం, మతం ఆధారంగా మహిళలపై దాడులు జరిగాయని, వారికి న్యాయం చేయాలని కోరారు.

శాంతి స్థాపనకు తొలి అడుగుగా బీరేన్ సింగ్‌ను తొలగించాలని పేర్కొన్నారు. మణిపూర్‌తో భారత్ ఉందని మోడీ చెప్పడం సరికాదని, భారతదేశం, భారతీయులు మాత్రమే మణిపూర్‌తో ఉన్నారు. ప్రధాని మోడీ, బిజెపి మణిపూర్‌తో లేవని అన్నారు. మణిపూర్‌ను బిజెపి మోసం చేసిందని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

హింసాకాండపై రాష్ట్ర గవర్నర్ ఆందోళన సముచితమేనని అన్నారు. హింసాకాండకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను గవర్నర్ ఆదేశించారని, కానీ ఇంత వరకూ ఏమీ జరగలేదని తెలిపారు. మణిపూర్ పరిణామాలను రాష్ట్రపతికి వివరించేందుకు సమయం కోరామని చెప్పారు.

మీడియాతో మాట్లాడుతున్న బృందాకరత్, మరియం ధావలే

గుంటూరు-సికింద్రాబాద్ మధ్య రైల్వే డబ్లింగ్ పనులు

- కేంద్ర ప్రభుత్వం ఆమోదం : డిఆర్ఎం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-సికింద్రబాద్ మధ్య రైల్వే ట్రాక్ డబ్లింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) ఎం.రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.2853.28 కోట్ల అంచనాలతో 239 కిలో మీటర్ల మేర డబ్లింగ్ పనులు చేయనున్నట్టు తెలిపారు. నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైల్వే లైను ప్రస్తుతం పిడుగురాళ్ల, శావల్యాపురం మధ్య ట్రాక్ నిర్మాణం పూర్తయిందని, శావల్యాపురం నుంచి గుండ్లకమ్మ మధ్య పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రకాశం జిల్లాలో భూ సేకరణ పెండింగ్ ఉండటం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడం వల్ల కూడా పనులు వేగంగా జరగడం లేదన్నారు. గుండ్లకమ్మ వరకు పూర్తయితే తరువాత కనిగిరి వరకు చేపడతామన్నారు. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్, విద్యుద్దీరణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలో తెనాలి, పిడుగురాళ్ల, రేపల్లే రైల్వే స్టేషన్‌లను ఆధునీకరిస్తున్నట్టు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎట్టకేలకు 5 ఎఫ్ఎస్ఎస్‌లకు క్లియరెన్స్

- షిప్‌యార్డుకు సుమారు రూ.19 వేల కోట్ల కాంట్రాక్టు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు అత్యంత కీలకమైన ఐదు ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల నిర్మాణ కాంట్రాక్టుకు ఎట్టకేలకు క్లియరెన్స్ వచ్చింది. 2013 సంవత్సరం నుంచి ఈ కాంట్రాక్టు కోసం హెచ్ఎస్ఎల్ చేయని ప్రయత్నమంటూ లేదు. షిప్ బిల్డింగ్, రిపేర్లలో ప్రపంచ స్థాయి సాంకేతిక సామర్థ్యం ఈ ప్రభుత్వరంగ సంస్థకు ఉంది. నౌకలు, సబ్‌మెరైన్‌ల తయారీలో స్వదేశీ పరిజ్ఞానం సొంతం చేసుకుంది. అయినా, ఈ కాంట్రాక్టును ఇచ్చే విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాన్చుతూ వచ్చింది. దీంతో, పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సుమారు రూ.19 వేల కోట్ల విలువైన ఐదు ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్-ఎస్)ల నిర్మాణ కాంట్రాక్టుకు కేంద్ర కేబినెట్ కమిటీ సెక్యూరిటీ (సిసిఎస్) ఎట్టకేలకు అనుమతులిచ్చింది. ప్రధాన మంత్రి మోడీ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు సిఎండి హేమంత్ ఖత్రీ హుటాహుటిన ఈ నెల 15న ఢిల్లీకి పయనమయ్యారు. షిప్‌యార్డు 2021-22లో రూ.755 కోట్లు, 2022-23లో రూ.1000 కోట్లు టర్నోవర్ సాధించింది. 2023-24లో రూ.1500 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

'1998' అభ్యర్థులందరికీ ఉద్యోగాలు

- పోరాట కమిటీ ధర్నాలో వక్తల డిమాండ్
- ఈ నెల 17 నుంచి 30 వరకు విస్తృత ఉద్యమం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998లో క్వాలిఫై అయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. 1998 డిఎస్‌సిలో మిగిలిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాట కమిటీ ఆధ్వర్యాన బుధవారం ఉదయం విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. సమస్య పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 17 నుంచి 20 వరకూ ప్రతి అభ్యర్థి సిఎం, విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వ సలహాదారులు, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్లకు పోస్టుకార్డులు రాయాలని నిర్ణయించారు. 25న భిక్షాటన, 30న రాస్తారోకోలు జరపాలని నిర్ణయించారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు పొదిలి రమణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. 25 ఏళ్ల నిరీక్షణ అనంతరం అందరికీ ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులు ఆశపడ్డారన్నారు. 2022 జులైలో ఉద్యోగం చేయడానికి ఇష్టం ఉన్న అభ్యర్థులు తమ అనుమతి తెలపాలని ప్రభుత్వం కోరిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 6,754 మంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకున్నారని పేర్కొన్నారు. వీరందరికీ ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి, 4,072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. అయితే రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల ఎస్‌సి, బిసి వికలాంగుల అభ్యర్థులైన 2,326 మందికి అన్యాయం జరిగిందని వివరించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లాల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఉద్యోగాలు రాని వారిలో బిసిలు 1,021 మంది, ఎస్‌సిలు 652 మంది, ఒసిలు 653 మంది ఉన్నారని, వారికి అవకాశం కల్పిస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని పేర్కొన్నారు.

ధర్నలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని, ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఒకపక్క ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా.. భర్తీ చేయడానికి ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తుందో అర్థం కావడం లేదని తెలిపారు. నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలను కలిపి విద్యావ్యవస్థను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. 1998 డిఎస్‌సి అభ్యర్థులు చేసే పోరాటానికి ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని తెలిపారు. నిరుద్యోగులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని అన్నారు. ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావు, అడ్వకేట్ సుదర్శనరావు, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు, డేవిడ్ రెల్లి సంఘం నాయకులు నాగేంద్ర, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు సుందరయ్య తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసులు, మోహనరావు, రమేష్, మేరీ సుహాసిని, కోమలి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు మార్గదర్శకాల అమలు

- వివాహాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బాల్య వివాహాల నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున ప్రచార అవగాహన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. బుధవారం బాల్య వివాహాల నియంత్రణపై రాష్ట్ర సచివాలయంలో యూనిసెఫ్ ప్రతినిధుల బృందంతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నియంత్రించకుండా ప్రసూతి మరణాలు సంఖ్యను తగ్గించడం సాధ్యం కాదని అన్నారు. చదువును మధ్యలో మానేసిన బాలికలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహాలను నియంత్రించే లక్ష్యంతో మండలానికి ఒక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వాటిని నియంత్రించేందుకు వీలుగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ నెంబరును కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. బాల్య వివాహాల నియంత్రణలో భాగంగా వివాహ రిజిస్ట్రేషన్లను తప్పనిసరి చేశామన్నారు. రాష్ట్ర స్త్రీ, శిశు, సీనియర్ సిటిజెన్స్‌శాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాల నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధం అవుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ యూనిసెఫ్ చీఫ్ జీలాలెమ్ బి టాఫెస్సీ మాట్లాడుతూ.. బాల్య వివాహాల నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళీకృష్ణ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనరు ఎం జానకి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యం హత్య కేసులో సిసి పుటేజ్‌లో ఉన్నవారి పేర్లేవీ?

- పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఆర్ఎఫ్ఎస్ఎల్) నివేదిక ఆధారంగా డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసుకు సంబంధించిన సిసి టివి పుటేజ్లోని వాళ్ల పేర్లను అనుబంధ చార్జిషీట్‌లో ఎందుకు చేర్చలేదని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులకు అనుగుణంగా అనుబంధ చార్జిషీట్ ఎందుకు దాఖలు చేయలేదని కూడా నిలదీసింది. ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు బుధవారం పూర్తికావడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. కేసుకు చెందిన సిడి ఫైల్‌ను సీల్డ్ కవర్‌లో అందజేయాలని పోలీసులను ఆదేశించింది. తన కొడుకు హత్య కేసులో వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు హస్తం ఉందని, ఈ కేసు దర్యాప్తును సిబిఐకి ఇవ్వాలని కోరుతూ డ్రైవర్ సుబ్రమణ్యం తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ వేసిన పిటిషన్‌ను గతంలో సింగిల్ జడ్జి కొట్టేశారు. మూడు నెలల్లోగా ట్రయిల్ పూర్తి చేసి ఫైనల్ చార్జిషీట్ దాఖలు చేయాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. దీనిని సవాల్ చేస్తూ తల్లిదండ్రులు వేసిన అప్పీల్ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ విచారణ ముగించింది. తీర్పును రిజర్వులో పెట్టింది.

రివర్స్ గేర్‌లో పాలన

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- మండపేట(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రాష్ట్రంలో వైసిపి పాలన రివర్స్ గేర్‌లో ఉందని, గత నాలుగేళ్లలో అభివృద్ధి ఒక్కడుగు కూడా ముందుకు పడలేదని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. బుధవారం ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలంలో పర్యటించారు. తొలుత ఏడిదలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అక్కడి కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండపేట కలువపువ్వు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రజల జీవితాలలో ఎటువంటి మార్పూ తేలేకపోయారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని పూర్తిగా ముంచేశారని అన్నారు. వ్యవసాయాన్ని వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని, రైతులకు వరమైన పోలవరం ప్రాజెక్టును విస్మరించిందని, గత నాలుగేళ్లలో సాగునీటి కాలువలకు పూడిక తీసింది లేదని, పొలాలకు నీరు అందించలేని స్థితిలో ఉందని విమర్శించారు. దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మూడవ స్థానంలోనూ, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవ స్థానంలోనూ రాష్ట్రం ఉందన్నారు. ఆక్వా సాగు వెంటిలేషన్‌పై ఉందని తెలిపారు. రంధ్రాలున్న సంచులతో ధాన్యాన్ని ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోందన్నారు.. కొబ్బరి రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో లాభసాటిగా గంజాయి సాగు ఒకటే ఉందని విమర్శించారు. గంజాయి సాగులో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలిపిన ఘనత వైసిపి సర్కారుదేనని దుయ్యబట్టారు. యూనిట్ రూ.2కే విద్యుత్ ఇస్తామని గద్దెనెక్కిన వైసిపి... నేడు జోన్ పరిధిలో తప్ప మిగిలిన చోట్ల యూనిట్‌కు రూ.3.50 వసూలు చేస్తోందన్నారు. ఇసుక బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని విమర్శించారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి, మద్యం రేట్లు విపరీతంగా పెంచేశారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులను రాజును చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశంలో ప్రతి రైతుపై రూ.74 వేల అప్పు ఉంటే, మన రాష్ట్రంలో మాత్రం ప్రతి రైతు నెత్తిమీద రూ.2.40 లక్షల అప్పు ఉందని తెలిపారు. టిడ్కో ఇళ్లకు పార్టీ రంగులు వేయడంలో ఉన్న శ్రద్ధ వాటిని పేదలకు అందించడంలో లేదని విమర్శించారు. అన్ని మండలాల్లో అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత సమాచారం సేకరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

మండపేట మండలం ఏడిదలో నిర్వహించిన రచ్చబండలో మాట్లాడుతున్న చంద్రబాబు

మండపేటకు ఇన్‌ఛార్జిగా ఉన్న ఒక నాయకుడు కాజులూరు మండలం పల్లిపాలెంలో అక్రమంగా 35 ఎకరాలు కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. దళితుడిని చంపిన వైసిపి ఎంఎల్‌సి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వాడేనని చంద్రబాబు గుర్తు చేశారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ : సిపిఐ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 916వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఆర్ఎంపి, సిఎంపి, లూబ్రికెంట్ హైడ్రాలిక్స్ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకించడంతోపాటు "రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి" నినాదంతో గురువారం ఉదయం 10 గంటలకు ఈ దీక్షా శిబిరం నుంచి సిపిఐ ఆధ్వర్యాన బస్సు జాతాను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ జాతా సెప్టెంబర్ 8వ తేదీ వరకు సాగుతుందని చెప్పారు. పోరాట కమిటీ సభ్యులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జాతాను విజయవంతం చేయాలని కోరారు.

సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్

ఎన్నికల్లో యువతకు 40 శాతం సీట్లు : లోకేష్

- టిడిపి గెలిస్తే పెట్టుబడుల వరద!
- వందరోజుల్లోనే విశాఖకు ఐటి కంపెనీలు వస్తాయి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తాయని, మొదటి వందరోజుల్లోనే విశాఖకు ఐటి పరిశ్రమలు తెస్తామని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామంలో ఆయన బస చేశారు. బుధవారం నిర్వహించిన హలో లోకేష్ కార్యక్రమంలో తమ భవిష్యత్తుపై యువత వ్యక్తం చేసిన సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు రాబట్టేందుకు తమ వద్ద చంద్రబాబు అనే బ్రాండ్ ఉందని, ఆ బ్రాండ్‌తోనే గతంలో కియా, టిసిఎల్, ఫ్యాక్స్ కాన్, సెల్ కాన్ వంటి ప్రఖ్యాత పరిశ్రమలు వచ్చాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ప్రజారాజధాని అమరావతిని పూర్తిచేస్తామని తెలిపారు. గత నాలుగేళ్లుగా యూనివర్సిటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించి, విద్యాప్రమాణాల పెంపుదలకు కృషి చేస్తామన్నారు. కెజి టు పిజి వరకూ విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన చేపడతామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంతో విద్యార్థుల కష్టాలు తీరుస్తామని, వచ్చే ఎన్నికల్లో టిడిపి తరుపున యువతకు 40 శాతంసీట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతిఏటా జాబ్ కేలండర్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల్లేక తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్న యువత గళాన్ని వైసిపి ప్రభుత్వానికి విన్పించేందుకే యువగళం పాదయాత్ర ప్రారంభించానని చెప్పారు. తప్పుచేయలేదు కాబట్టే ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కీర్తనకు రూ.25 లక్షలు ఇవ్వాలి : ఐద్వా

ప్రజాశక్తి -తాడేపల్లి (గుంటూరు జిల్లా)

రాజమండ్రి బ్రిడ్జి పైనుంచి భార్యను, ఇద్దరు బిడ్డలను గోదావరిలోకి నెట్టిన ఘటనలో బతికి బయటపడ్డ చిన్నారి కీర్తనను బుధవారం ఐద్వా రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసకుమారి, నాయకులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, ఎన్.తులసమ్మ, వై.బర్నబస్ పరామర్శించారు. ప్రస్తుతం ఆ చిన్నారి తెనాలిలో తమ పెద్దమ్మ వద్ద ఉంటోంది. జరిగిన ఘటనను ఐద్వా నేతలకు కీర్తన వివరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకులు డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ.. బాధిత బాలికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేయాలని, చిన్నారి చదువుకున్నంత వరకు బాధ్యతను తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలను తెలియజేస్తామన్నారు.

వైసిపి తరపున వలంటీర్ల ప్రచారం

- ఎన్నికల కమిషనరుకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో వైసిపి తరపున వార్డు వలంటీర్లు యథేచ్ఛగా ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఎన్నికల కమిషనరుకు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కమిషనరును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, నియమ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రం మొత్తం జరుగుతున్నాయని వివరించారు. విజయనగరం జిల్లా పెంటశ్రీరాంపురం సర్పంచ్ ఎన్నికల్లో సైతం గ్రామ వలంటీర్లు, విఆర్ఎ, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వైసిపికి ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె పంచాయతీలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లు కూడా వైసిపికి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించలేకపోవడం చూస్తుంటే అధికారులు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా తక్షణం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు.

టిడిపి నేతల పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా, అంగళ్లులో చోటుచేసుకున్న ఘటనలో ముదివేడు పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ టిడిపి నేతలు వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. తమపై ఉన్న కేసులను కొట్టేయాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, డి రమేష్, తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, టిడిపి నేత గంటా నరహరి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లపై ఐపిసిలోని 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినందున కొట్టేయాలన్న క్వాష్ పిటిషన్‌పై విచారణ చేయలేమని జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి తేల్చి చెప్పారు. బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చునని వారికి సూచన చేశారు. ఇదే ఘటనలో తమపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి సీనియర్ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ కె సురేష్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రమట్టి దిబ్బలను కాపాడుకుంటాం

భీమిలి ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

- జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి -భీమునిపట్నం (విశాఖపట్నం)

చారిత్రక ఎర్రమట్టి దిబ్బలను కాపాడుకుంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయయాత్ర మూడవ విడతలో భాగంగా విశాఖ జివిఎంసి నాల్గవ వార్డు పరిధి నిడిగట్టు సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. సహజసిద్ధమైన సుమారు 60 ఎకరాల ఎర్రమట్టి దిబ్బలను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ తరహా ఎర్రమట్టి దిబ్బలు ఆసియా ఖండంలో కేవలం శ్రీలంక, తమిళనాడు, విశాఖ జిల్లా భీమిలిలో మాత్రమే ఉన్నాయని వివరించారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వ అండతో ఎర్రమట్టి దిబ్బల్లో కొంత ప్రాంతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే-అవుట్లుగా వేసి వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిరక్షించే నిమిత్తం తీసుకోబోయే చర్యలు వైసిపి ప్రభుత్వం 48 గంటల్లో వెల్లడించాలని, లేని పక్షంలో గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, నాయకులు పంచకర్ల రమేష్‌బాబు, నియోజక వర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- పోరుయాత్రలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - ఫిరంగిపురం, మేడికొండూరు (గుంటూరు జిల్లా)

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ తెలిపారు.



ఫిరంగిపురంలో అంగన్వాడీ పోరుయాత్రను ప్రారంభిస్తున్న సుబ్బరావమ్మ

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీల పోరుయాత్రను గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ఆమె బుధవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా జీతాలివ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజకీయ జోక్యం నివారించాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన పోరుయాత్ర ఫిరంగిపురం, మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ప్రచార సభల్లో సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేవారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే పోరుబాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి దీప్తి మనోజ, తదితరులు పాల్గొన్నారు.

విజన్ పేరుతో చంద్రబాబు కొత్త రాగం

మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఎలాంటి విజన్ లేకుండా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎన్నికల కోసం విజన్ 2047 అంటూ కొత్త రాగం మొదలుపెట్టారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో వున్నప్పుడు ఉచిత విద్యుత్ ఇస్తామంటే వెటకారంగా మాట్లాడారని అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రజలు కోరితే.. కాల్పులు జరిపించిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. గతంలో చెప్పిన విజన్ 2020 ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు చెప్పే విజనరీ ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. సొంత నియోజకవర్గం కుప్పానికి కనీసం నీళ్లు ఇవ్వలేని పరిస్థితి చంద్రబాబుది అని అన్నారు. కనీసం ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా బాగు చేసిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వాస్పత్రుల్లో పేదల నుంచి కూడా డబ్బులు వసూలు చేసిన విజన్ చంద్రబాబుది అని ఆరోపించారు.

దళిత కుటుంబంపై దాడి

- నిందితులపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు : ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో/ బాపట్ల

ప్రకాశం జిల్లా దర్శి మండలంలో దళిత కుటుంబంపై దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి.. అరెస్టు చేసినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలను ఆయన బుధవారం మీడియాకు వెల్లడించారు. బొట్లపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డి కుమార్తె భార్గవి, అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు సాయిరాం ఈ ఏడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ వివాహన్ని బ్రహ్మారెడ్డి కుటుంబీకులు అంగీకరించలేదు. ఈ క్రమంలో సాయిరాం కుటుంబంపై బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిచి మాట్లాడారు. గొడవలు పడొద్దని సర్ధిచెప్పారు. సోమవారం రాత్రి సాయిరాం సోదరి కామునూరి మౌనిక ఇంటికి సమీపంలోని కుళాయి వద్ద నీళ్లు పట్టుకునే సమయంలో బ్రహ్మారెడ్డి, ఆయన భార్య పుల్లమ్మ దాడి చేశారు. కళ్లలో కారం చల్లారు. కాళ్లతో తన్నుతూ.. కర్రలతో కొట్టుకుంటూ లాక్కెళ్లారు. మౌనిక తల్లి అడ్డుకోగా ఆమెపైనా దాడి చేశారు. మాపైనే కేసులు పెడతారా? అంటూ కత్తితో పొడవబోయారు. అంతటితో ఆగకుండా పెట్రోలు పోసి చంపాలనే యత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వారిని అడ్డుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన బ్రహ్మారెడ్డి, ఆయన భార్య పుల్లమ్మను అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి వెల్లడించారు. దళిత కుటుంబంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కెవిఎస్, ఐద్వా ఆధ్వర్యంలో దర్శిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

స్వాతంత్ర్య వేడుకల వేళ దళితులపై దాడులు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

స్వాతంత్ర వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో దళిత మహిళలపై పెత్తందారులు దాడికి పాల్పడటం పట్ల ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా దర్శిలో దళిత మహిళలపై ఓ దంపతులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారన్నారు. కళ్లలో కారం కొట్టి.. కత్తులతో దాడి చేశారని తెలిపారు. దళితులకు, ఒంటరి మహిళలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి రక్షణను గాలికి వదిలేసిందని విమర్శించారు. కర్నూలు జిల్లా కోసిగి మండలంలో పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న మహిళపై ఐదుగురు సామూహిక అత్యాచారం చేశారని తెలిపారు. ఈ తరహా కేసుల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఎపిఎన్‌జిఒ మహాసభలను జయప్రదం చేయండి : ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న ఎపిఎన్‌జిఒ 21వ రాష్ట్ర మహాసభలను ఆర్‌టిసి ఉద్యోగులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

SIGACHI INDUSTRIES LIMITED
229/1 & 90, KALYAN'S TULSIRAM CHAMBERS,
MADINAGUDA, HYDERABAD - 500049, TELANGANA
CIN: L24110TG1989PLC009497

పిఎఎస్-1
(కంపెనీస్ (ప్రాస్పెక్టస్& అలాట్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీస్) రూల్స్, 2014 యొక్క సెక్షన్ 27(1) మరియు రూల్ 7(2) అనుసరించి)

ఏదైతే జారీచేయబడిన ప్రాస్పెక్టస్ కొరకు అంశాలలో మార్పులు లేదా ప్రాస్పెక్టస్‌ను సిఫారసుచేసిన ఏదేని క్రాంట్రాక్ యొక్క నియమాలను సవరించుట కొరకు ప్రత్యేక తీర్మాణం యొక్క నోటీసు వివరాలు ఇచ్చే ప్రకటన.

కార్పొరేట్ గుర్తింపు నంబరు (సిఐఎన్)- ఎల్24110టిజి1989పిఎల్‌సి009497
కంపెనీ పేరు- సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు చిరునామా- 229/1&90, కళ్యాణ్ తుల్సిరామ్ చాంబర్స్, మదీనగూడ, హైదరాబాద్-500049- తెలంగాణ.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, తేది 10.08.2023 నాటి తీర్మాణం ద్వారా, ఇషష్యు ధర రూ.163/- వాటా ఒక్కింటికి సరాసరిగా రూ.12,542.85 లక్షల వద్ద సుమారు 76,95,00 వరకుగల ఈక్విటీ వాటాల జారీతో సంబంధించి (జారీచేయబడిన ఏవైతే తేది 08.11.2021 కొరకు సవరణకు లేదా) తేది 08.11.2021నాటి ప్రాస్పెక్టస్‌ను పేర్కొంటూ కాంట్రాక్టు నియమాలలో సవరణకు బోర్డు ప్రతిపాదిస్తుంది.

సదరు తీర్మాణం అనుసరించి, తదుపరి ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు ప్రతిపాదన ఆమోదం కొరకు, వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులచే ప్రత్యేక తీర్మాణం చేయబడుతుంది.

అట్టి సవరణ/మార్పులుకు సంబంధించిన వివరాలు దిగువ విధంగా ఉన్నవి:-

1) కాంట్రాక్టు నియమాలలో అంశాల సవరణ (అంశాలు మార్చుట)-తేది 22.10.2021 నాటి ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న పబ్లిక్ ఇష్యు అంశాలలో ఎన్విసేజ్ ప్రాజెక్టులలో ఒక దాని లొకేషన్ మార్చుటకు.
2) ప్రతిపాదిత సవరణ/ మార్పు వివరాలు- కర్నూలు (ఆం.ప్ర) నుండి దహేజ్ (గుజరాత్)కు సిసిఎస్ (క్రాస్‌కర్మెల్లోస్ సోడియం) ప్రాజెక్టు యొక్క రీలొకేషన్.
3) సవరణ కొరకు కారణం/పరిధి-
కర్నూలు (ఆం.ప్ర) నుండి దహేజ్ (గుజరాత్)కు సిసిఎస్ (క్రాస్‌కర్మెల్లోస్ సోడియం) ప్రాజెక్టు యొక్క రిలొకేషన్ కొరకు కారణం మరియు పరిధి దిగువ విధంగా:
★ పరిపాలనా/ ఆపరేషనల్ సౌలభ్యం: దహేజ్ అనునది మద్దతు పరిపాలనా మరియు ఆపరేషనల్ వాతావరణాలను ఆఫర్‌చేస్తున్నది, ఏవైతే సున్నిత రెగ్యులేటరీ ప్రాసెసెస్& మంచి మౌలికసదుపాయాలు, సిసిఎస్ ప్రాజెక్టును ఖచ్చితంగా నిర్వహించుటకు సులభ వాతావరణం కలిగియుంది.
★ ముడి సరుకు సులభంగా లభ్యమవుతుంది: దహేజ్‌లో సులభంగా పొందు నిలువలు ముడిసరుకు ఉన్నందున, అది సిసిఎస్ ప్రాజెక్టుకు లాభసాటి, ధరలో పొదుపు మరియు త్వరితగతిన ఆపరేషన్‌ను అభివృద్ధిచేయవచ్చును. సముద్ర తీరం ఉన్నందున, తదుపరిగా ఎగుమతి& దిగుమతి సదుపాయాలు కు సులభతరం.
★ ప్రత్యేక ఆర్థిక జోన్ (సెజ్) లొకేషన్: సెజ్ లొకేషన్‌లో ఉన్నందున, అదనపు లాభాలు కలుగును, అంతేకాకుండా ఎగుమతి& దిగుమతి సులభం, హార్డిలెస్ తగ్గింపు మరియు అంతర్జాతీయ ట్రేడ్ అవకాశాలు మెండుగా ఉన్నవి.
★ నిలువలు బదిలీచేయవచ్చు: దహేజ్ యొక్క విసినిటీలో కంపెనీ యొక్క ప్రస్తుత తయారీ సదుపాయాలు ప్రత్యక్షంగా ఉన్నవి, వాటితోసహా కార్యకలాపాలు ఉన్నవి, సినెర్జిస్ బదిలీచేయుట మరియు మార్చుట అవకాశాలు మరియు మొత్తానికి ప్రాజెక్ట్ సామర్థ్యం మెరుగుపరచుట.
★ మంచి వ్యాపార ప్రాస్పెక్ట్స్: దహేజ్ అనుకూలమైన మార్కెట్ అవకాశాలు మరియు సిసిఎస్ ఉత్పత్తుల కొరకు డిమాండ్‌ఉంది. అత్యధిక వ్యాపారంను చూరగొనుటకు అవకాశాలు మరియు కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీస్ కొరకు డిమాండ్ పెరుగుట, ప్రాజెక్టు కొరకు ప్రత్యామ్నాయం.
★ కాంప్లెక్స్ ఎక్స్‌పేయింట్ తయారీ సదుపాయాలు: దహేజ్ అనునది కాంప్లెక్స్ ఎక్సిపియెంట్ తయారీ సదుపాయాలు నెలకొల్పుట కొరకు తగినది ఇది సిసిఎస్ ప్రాజెక్ట్ సక్సెస్ లేదా లాభసాయి పరిశ్రమగల సిసిఎస్ ప్రాజెక్ట్‌కు ఇది సిగ్నిఫెంట్ కంట్రిబ్యూట్.
4) కంపెనీ యొక్క ఆర్థిక స్తితి పై ప్రభావం పడదు- అందు కంపెనీ యొక్క ఏదేని ఆర్థిక స్తితిపై ప్రభాగం పడదు.
5) కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన మేజర్ రిస్క్ ఫ్యాక్టర్స్- తయారీ స్వభావం అదే విధంగా కేటాయించిన మొత్తంలో మార్పులేదు, దహేజ్, గుజరాత్ వద్ద ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న రిస్క్ ఫ్యాక్టర్స్ మినహాయించి సిసిఎస్ ప్రాజెక్టు యొక్క రిలొకేషన్‌కు సంబంధించిన ఏవేని తదుపరి రిస్క్ ఫ్యాక్టర్స్ లేవు.
6) డైరెక్టర్ల పేర్లు ఎవరైతే ప్రతిపాదిత మార్పు/సవరణపై ఓటువేస్తున్నవారు- నిల్
7) ఎవరైనా ఆసక్తిగల వ్యక్తి ఎక్స్‌ప్లెనేటరీ స్టేట్‌మెంట్‌తోపాటు ప్రత్యేక తీర్మాణాల కాపీని ఉచితంగా కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు వద్ద లేదా కంపెనీ సెక్రటరీ మిస్ శ్రేయ మిత్ర వారి కార్యాలయం: 229/1 & 90, కళ్యాణ్ తులసిరామ్ చాంబర్స్, మదీనగూడ, హైదరాబాద్-500049, తెలంగాణ వద్ద పొందవచ్చును లేదా దాని కాపీ కొరకు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా., www.Sigachi.com పై చూడవచ్చును.

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ తరపున
సం/- శ్రేయ మిత్ర
కంపెనీ సెక్రటరీ& కాంప్లైన్స్ ఆఫీసర్

తేది: 16.08.2023
ప్రదేశం: హైదరాబాద్

అత్యాచార నిందితులను అరెస్ట్ చేయాలి

ఐద్వా, కెవిపిఎస్, ఆర్‌విఎస్ నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సుందరయ్య జంక్షన్‌లో ధర్నా చేస్తున్న ఐద్వా, కెవిపిఎస్, ఆర్‌విఎస్ నాయకులు

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లిన దళిత వివాహిత మహిళపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులు ఉపేంద్ర, రామానాయుడును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్, ఐద్వా, రజక వృతిదారుల సంఘం (ఆర్‌విఎస్) సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ కర్నూలు కొత్త బస్టాండ్ సుందరయ్య జంక్షన్‌లో ఐద్వా, కెవిపిఎస్, ఆర్‌విఎస్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఐద్వా కర్నూలు జిల్లా అధ్యక్షులు కె.అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి కెవిపిఎస్, ఐద్వా, ఆర్‌విఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్.అలివేలు, ఎండి.ఆనంద్‌బాబు, సి.గురుశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు, డివైఎఫ్ఐ రాష్ట్రఉపాధ్యక్షులు శిరీష మాట్లాడారు. కర్నూలు జిల్లాలో మహిళలపైన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. రెండు నెలల క్రితం గోనెగండ్ల మండలం, గంజహళ్లి గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను నేటికీ అరెస్టు చేయలేదని విమర్శించారు. ఆ బాధిత కుటుంబానికి ఎలాంటి సహకారం అందించకపోగా, బాలికను చదువుకు దూరం చేసిన పాపం అధికారులదేనన్నారు. తాజా ఘటనలో నిందితులైన ఉపేంద్ర, రామానాయుడులను అరెస్టు చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.విజయమ్మ, ఐద్వా, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

అదానీ పోర్టు వాహనాల అడ్డగింత

- మూలపేటలో నిర్వాసితుల ఆందోళన
- ప్రత్యేక రోడ్డు నిర్మించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - నౌపడ

పోర్టు వాహనాలు అడ్డుకున్న నిర్వాసితులు

శ్రీకాకుళం జిల్లా మూలపేట అదానీ పోర్టు వాహనాలను నిర్వాసిత గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. భారీ వాహనాలతో రహ దారులు ధ్వంసమవు తున్నాయని, ప్రత్యేక రోడ్డు వేసుకోవాలని నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలు పోర్టు వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు భారీగా మోహరించి నిర్వాసితులను అడ్డుకోవడంతో కాసేపు ఉద్రికత్త చోటు చేసుకుంది. పోర్టు వాహనాలను ఎంతసేపటికి కదలనీయకపోవడంతో మూలపేట సర్పంచ్ బాబూరావుతో పాటు పలువురిని పోలీసు బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. చర్చలకు ముందుకు రావడంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. అనంతరం నిర్వాసితులు విలేకరులతో మాట్లాడుతూ.. పోర్టు వాహనాలతో రహదారులు ధ్వంసమవుతున్నాయని, ప్రయాణానికి ఇబ్బంది కలుగుతోందని గతనెల 30న పోర్టు వాహనాలను అడ్డుకున్నామని, ఈ నెల 14న పోర్టు వాహనం ఢీకొని ఒక వ్యక్తి గాయపడిన ఘటనలో బాధితుని బంధువులు ఆందోళన చేశారని గుర్తు చేశారు. అయినా పోర్టు యాజమాన్యం, అధికారుల్లో స్పందన లేదని వాపోయారు. మూలపేట సర్పంచ్ బాబూరావు మాట్లాడుతూ.. పోర్టు కాంట్రాక్టు పనులన్నీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరులకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. గ్రామస్తుల మధ్య విభేదాలు సృష్టించి విభజించు - పాలించు విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎపిఎస్‌ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ

ధర్నాలో పాల్గొన్న ఎవి నాగేశ్వరరావు, లక్ష్మణరావు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపిఎస్ ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎపిఎస్ ఆర్‌టిసిలో పని చేస్తున్న వేలాది మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి ఆర్‌టిసిలో పనిచేస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనాలు కూడా అమలు కావట్లేదని, అధికారులు ఇచ్చిన జిఒలు, సర్క్యులర్‌లు కాగితాలకే పరిమితం అవుతున్నాయని అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ పూర్తిస్థాయిలో కార్మికులకు అందించే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన జీతాలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలని, కాంట్రాక్టు వ్యవస్థ రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించాలని, గతంలో తొలగించిన కార్మికులను తక్షణమే విదుల్లోకి తీసుకోవాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. అనంతరం ఆర్‌టిసి ఎండికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు సుందరయ్య, జిలానీ బాష, ఫెడరేషన్ నగర గౌరవ అధ్యక్షులు యం.బాబురావు, ప్రధాన కార్యదర్శి బి.మాధవ, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రాస్తారోకో

- పలువురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలపై అదనపు విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహ రించుకోవాలని, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కడప నగరంలోని పూలే సర్కిల్ వద్ద బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్ మాట్లా డుతూ.. విద్యుత్ వినియోగదారులపై 14 నెలలుగా విద్యుత్ వినియోగ ఛార్జీలకు అదనంగా 25 నుంచి 80 శాతం అదనపు భారం మోపుతున్నారన్నారు. వినియోగదారుడు ప్రతినెలా సక్రమంగా బిల్లు చెల్లిస్తున్నప్పటికీ పాత బకాయిల పేరుతో మళ్లీ అదనపు ఛార్జీలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలకు వినియోగదారులు ఏమాత్రమూ బాధ్యులు కాదని, ఈ విషయాన్ని ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ వినియోగ ఛార్జీలు మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా అదనంగా రకరకాల పేర్లతో భారాలు మోపడం తగదన్నారు. విద్యుత్ భారాలను ప్రభుత్వం తక్షణమే ఆపకపోతే రానున్న కాలంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో సందర్భంగా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. వన్‌టౌన్ సిఐ నాగరాజు ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. రాస్తారోకోలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, పాపిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, పారుక్ హుస్సేన్, మహబూబ్ తార, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేశారు కత్తెర మరిచారు

- తీవ్ర కడుపునొప్పితో తిరిగి బాధితురాలు ఆస్పత్రికి
- విషయం బయటకు పొక్కడంతో విచారణకు ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

గర్భిణికి ఆపరేషన్ చేసి బిడ్డను తీసిన వైద్యులు కడుపులో ఫోర్‌సెప్స్ (కత్తెర) వదిలేసి కుట్లువేసిన ఘటన ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. బాధితురాలు ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 19న పెదపాడు మండలం ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన జి స్వప్న ప్రసవం కోసం ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చేరారు. ఆమెకు సిజేరియన్ చేసిన వైద్యులు బిడ్డను బయటకు తీశారు. డిశ్చార్జి అయ్యాక ఆమె ఇంటికి వెళ్లిపోయారు.

ఆ తరువాత అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తుండేది. సాధారణ నొప్పి అనుకొని మందులు వాడేవారు. ఈ నెల 8న విపరీతమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను మళ్లీ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అత్యవసర కేసుగా పరిగణించి విజయవాడ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడ ఆస్పత్రిలో పరీక్షలు చేయగా ఆమె కడుపులో కత్తెర ఉందని, పేగు కుళ్లిపోయిందని వైద్యులు తెలిపారు. ప్రసవం సమయంలో ఏలూరు ఆస్పత్రి వైద్యులు కడుపులో కత్తెర ఉంచి ఆపరేషన్ చేశారని నిర్ధారించారు. విజయవాడ ఆస్పత్రిలో ఆమెకు ఆపరేషన్ చేసి కుళ్లిపోయిన పేగును, కత్తెరను తీసేశారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. బాధితురాలు క్షేమంగా ఉన్నట్లు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో జరిగిన ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ స్పందించి విచారణ కమిటీ వేశారు.

విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు : సూపరింటెండెంట్

ఆపరేషన్ సమయంలో కడుపులో కత్తెర మర్చిపోయి కుట్లు వేసిన మాట వాస్తవమని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం శశిధర్ తెలిపారు.

ఏలూరు బోధన ఆస్పత్రిలో సీనియర్ వైద్యులు డాక్టర్ పద్మ నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ సిజేరియన్ చేసినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం సర్జరీకి వెళ్లేముందు సర్జరీకి ఉపయోగించిన పరికరాలు లెక్క చూసుకొని రాసుకోవాలని, సర్జరీ తర్వాతా మరోసారి లెక్క చూసుకుని అన్నీ వచ్చాయో, లేదో చూసుకోవాలన్నారు.

ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణ కమిటీని నియమించారన్నారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇకముందు ఇలాంటివి జరగకుండా సర్జరీ సమయంలో చెక్‌లిస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు.

నరసరావుపేటలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- 20 నుంచి 26 వరకు నిర్వహణ
- 13 జిల్లాల నుండి హాజరు కానున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

భారత్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ (అగ్నిపథ్) ర్యాలీని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, కల్నల్ పునీత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వివరాలు వెల్లడించారు. నరసరావుపేటలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో తెల్లవారుజామున నాలుగు గంటలకే ర్యాలీ ప్రారంభం అవుతుందని చెప్పారు. ర్యాలీని ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ గుంటూరు ఆధ్వర్యంలో హెచ్‌క్యూ దక్షిణ్ భారత్ ఏరియా - హెచ్‌క్యూ రిక్రూటింగ్ జోన్, చెన్నై పర్యవేక్షిస్తుందని తెలిపారు. అభ్యర్థుల కోసం తాగునీరు, తాత్కాలిక మొబైల్ మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రం ఏర్పాట్లు చేశామన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (పదవ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (ఎనిమిదవ తరగతి), అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ విభాగాల్లో అభ్యర్థుల భర్తీకి కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (సిఇఇ) ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన ఐదు వేల మంది వరకు అభ్యర్థులు ఈ ర్యాలీకి హాజరుకానున్నారని, వీరు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన వారని వివరించారు. ఒకవేళ వర్షం వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లూ చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జెసి శ్యామ్‌ప్రసాద్, డిఆర్ఒ వినాయకం పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వలంటీర్

ప్రజాశక్తి-కాశినాయన (వైఎస్ఆర్ జిల్లా)

ప్రేమ పేరుతో ఓ మాజీ దళిత వలంటీర్‌ను మరో వలంటీర్ మోసం చేసిన ఘటన వైఎస్ఆర్ జిల్లా కాశినాయన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. నిన్ను ప్రేమిస్తున్నానని, నిన్నే పెళ్లి చేసుకుంటానని చెప్పి మూడు సంవత్సరాల నుంచి ఆకుల నారాయణపల్లె గ్రామం దళిత కుటుంబానికి చెందిన మాజీ వలంటీర్ తిరివీధి కావేరి అనే యువతిని అదే గ్రామానికి చెందిన చెన్నారెడ్డి అనే వలంటీర్ వేధించేవాడు. ఈ విషయం అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో వారు వలంటీర్ పని మాన్పించారు. అయినా చెన్నారెడ్డి వెంటపడుతూ మానసికంగా ఇబ్బంది పెడుతుండేవాడు. నిన్నే పెళ్లి చేసుకుంటా అని నమ్మించి మూడు రోజుల క్రితం బెంగళూరుకు తీసుకెళ్లి మోసం చేశాడు. అతనితో పెళ్లి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నరసాపురం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

SIGACHI INDUSTRIES LIMITED
229/1 & 90, KALYAN'S TULSIRAM CHAMBERS,
MADINAGUDA, HYDERABAD - 500049, TELANGANA
CIN: L24110TG1989PLC009497

34వ వార్షిక సర్వసభ్య సమావేశం, పుస్తక ముగింపు, రికార్డు తేది మరియు రిమోట్ ఇ-ఓటింగ్ సమాచారపు ప్రకటన.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ఏజియం నోటీసులో ఇచ్చినట్లుగా వ్యాపార సమీక్షకుగాను, సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యొక్క సభ్యుల 34వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజియం) 7 సెప్టెంబర్, 2023, గురువారం రోజున ఉ॥ 11:00గం.లకు ("విసి")/ ఇతర ఆడియో-విజువల్ మాధ్యమాలు ("ఓఎవిఎం") ద్వారా నిర్వహించబడుతుంది.

సెబీ సర్క్యులర్ నం.సెబీ/హెచ్‌ఓ/సిఎఫ్‌డి/సిఎండి1/సిఐఆర్/పి/2020/79 తేది: మే 12, 2020 మరియు సెబీ/హెచ్‌ఓ/సిఎఫ్‌డి/సిఎండి2/సిఐఆర్/పి/2021/11 తేది: జనవరి 15, 2021న వరుసగా మరియు సర్క్యులర్ నం.14/2020 తేది: ఏప్రిల్ 08, 2020 మరియు సర్క్యులర్ నం.17/2020 తేది ఏప్రిల్ 13, 2020, 22/2020 తేది జూన్ 15, 2020, 33/2020 తేది సెప్టెంబర్ 28, 2020, 39/2020 తేది డిసెంబర్ 31, 2020, 10/2021 తేది జూన్ 23, 2021, 20/2021 తేది డిసెంబర్ 08, 2021 మరియు సర్క్యులర్ నం.03/2022 తేది: 05.05.2022 (సేకరణలో "ఎంసిఏ సర్క్యులర్స్"గా పేర్కొనబడును)తో సంబంధించి సర్క్యులర్ నం.11/2022 తేది డిసెంబర్ 28, 2022, సర్క్యులర్ నం.20/2020 తేది మే 05, 2020తో చదువబడే ఎంసిఏ జనరల్ సర్క్యులర్ నం.02/2021 తేది జనవరి 13, 2021తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క వర్తించు నియమాలతో అనుసరించి విసి/ఓఎవిఎం ద్వారా ఏజియం తెలియజేయబడుతుంది. ఏజియం వద్ద సభ్యుల భౌతిక హాజరు అవసరంలేదు. విసి/ఓఎవిఎం ద్వారా ఏజియంకు హాజరైన సభ్యులు, ఏజియం నోటీసులో సిఫారసుచేసిన విధానాలను పాటించుట ద్వారా ఏజియంకు కూడా హాజరవవచ్చును.

ఏజియం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలు మరియు వార్షిక రిపోర్టును సెబీ సర్క్యులర్ తేది మే 12, 2020తో అనుసరించి కంపెనీ/ డిపాజిటరీస్‌తో ఎవరి ఇమెయిల్ ఐడిలైతే రిజిస్టర్‌చేసుకున్నారో అట్టి వాటాదారులందరికి ఆగస్టు 16, 2023న పంపుట జరిగింది.

కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91 అనుసరించి, వార్షిక సర్వసభ్య సమావేశం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ & వాటా బదిలీ పుస్తకాలు 01.09.2023 నుండి 07.09.2023 (రెండు రోజులతో కలిపి) ముగిసియుంటాయి.

సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్) ద్వారా విసి/ఓఎవిఎం ద్వారా ఏజియంకు హాజరగుటకు సభ్యులకు సదుపాయం కల్పించబడుచున్నది. సభ్యులు దానిని www.evotingindia.com వద్ద అక్సెస్‌చేయవచ్చును.

కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 మరియు సెబీ (ఎల్‌ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 యొక్క నియమాలలో, సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్) (రిమోట్ ఇ-ఓటింగ్) యొక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా ఏజియం ప్రకటనలో ఇచ్చిన తీర్మాణాలన్నింటి పై ఎలక్ట్రానిక్ విధానాల ద్వారా వారి ఓటువేయుటకు సదుపాయంను కంపెనీ కల్పిస్తుంది. ఏజియం తేదీన రిమోట్ ఇ-ఓటింగ్ అదే విధంగా ఇ-ఓటింగ్ విధానం వినియోగించి సభ్యునిచేత ఓట్లువేయుటకు సదుపాయంను సిడిఎస్ఎల్‌చేత సమకూర్చబడును. సభ్యులందరికి తెలియజేయునది:

(1) 34వ ఏజియం నోటీసులో ఇవ్వబడిన వ్యాపారంను ఎలక్ట్రానిక్ విధానాల ద్వారా ఓటింగ్ ద్వారా సమీక్షించవచ్చును.
(2) రిమోట్ ఇ-ఓటింగ్ 04.09.2023న ఉ॥ 9:00గం.లకు ప్రారంభమవుతుంది.
(3) రిమోట్ ఇ-ఓటింగ్ 06.09.2023న సా॥ 5.00గం.లకు ముగించబడుతుంది.
(4) డివిడెండ్ పరిగణించుట మరియు ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా లేదా ఏజియం వద్ద ఓటుకు అర్హత నిర్ధారణచేయుట కొరకు కటాఫ్ తేది 31.08.2023.
(5) కంపెనీ వాటాలు సేకరించిన మరియు ఏజియం నోటీసు పంపబడిన తరువాత కంపెనీ సభ్యుడైనా ఏవరైనా వ్యక్తి helpdesk.evoting@cdslindia.com వద్ద అభ్యర్ధన పంపుట ద్వారా లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను పొందవచ్చును.
(6) రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా లేదా ఏజియం వద్ద ఇ-ఓటింగ్ విధానం ద్వారా ఓటుకు అర్హతగల ఇతరులు తీర్మాణాలపై వారి ఓటువేయని ఎవరైనా, విసి సదుపాయం ద్వారా ఏజియంలో హాజరైన అట్టి సభ్యులుకు రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూలు సదుపాయం ఏజియం వద్ద అందుబాటులో ఉంటుందని సభ్యులు గమనించగలరు. ఏజియంకు ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటును వేసిన సభ్యులు ఏజియంకు హాజరవవచ్చును కాని అచ్చట తిరిగి ఓటువేయుటకు అనుమతించబడరు.
(7) సభ్యులు ఎవరైతే వారి ఇమెయిల్ అడ్రసెస్ రిజిస్టరు చేసుకోలేదో అట్టి వారిని వారి ఇమెయిల్ అడ్రసెస్ ను డిపాజిటరీస్/కంపెనీ/రిజిస్ట్రార్& వాటా బదిలీ ఏజెంట్ అనగా., బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో 34వ వార్షిక సర్వసభ్య సమావేశం నోటీసుతోపాటు 2022-23 వార్షిక రిపోర్టు యొక్క కాపీలు స్వీకరించుటకు వారి ఇమెయిల్ అడ్రసెస్‌ను రిజిస్టర్‌చేసుకోవలసిందిగా కోరబడుచున్నది.
(8) ఏజియం నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.sigachi.com మరియు సిడిఎస్ఎల్ వెబ్‌సైట్ https://www.evotingindia.com/. పై అందుబాటులో ఉంటుంది.
(9) సందేహాల విషయంలో, సభ్యులు సభ్యుల కొరకు తరుచుగా అడుగే ప్రశ్నలు (ఎఫ్ఎక్యూలు) మరియు https://www.evotingindia.co.in యొక్క డౌన్‌లోడ్స్ సెక్షన్ వద్ద అందు బాటు లోగల వాటాదారుల కొరకు ఇ-ఓటింగ్ యూజర్ మాన్యువల్‌ను పరిశీలించవలసిందిగా కోరబడుచున్నది లేదా సంప్రదించండి: మిస్ శ్రేయ మిత్ర, కంపెనీ సెక్రటరీ, 229/1 & 90, కళ్యాణ్ తులసిరాం చాంబర్స్, మదీనగూడ, హైదరాబాద్-500049, తెలంగాణ, ఇమెయిల్ ఐడి: cs@sigachi.com ఫోన్: 040 40114874.

ప్రశాంతంగా మరియు పారదర్శక విధానంలో ఇ-ఓటింగ్ ప్రక్రియ మరియు ఏజియం వద్ద ఓటింగ్‌ను స్క్రుటినైజ్‌చేయుటకు స్క్రుటినైజర్‌గా మిస్ ఆకాంక్ష, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీని కంపెనీ యొక్క బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నియమించారు. స్క్రుటినైజర్ రిపోర్టుతోపాటు ఫలితాలు ఏజియం ముగిసిన సమయం నుండి 48 గంటలల్లోగా స్టాక్ ఎక్స్ఛేంజికి సమాచారం ఇవ్వబడు తుంది మరియు కంపెనీ వెబ్‌సైట్ www.sigachi.com పై ఉంచబడుతుంది.

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ తరపున బోర్డు ఆదేశం ద్వారా
సం/-
శ్రేయ మిత్ర,
కంపెనీ సెక్రటరీ & కాంప్లైన్స్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 16.08.2023

సంపాదకీయం

'సంస్కరణల' బాట!

స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత విడివిడిగా చేసిన ప్రసంగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరువురి ప్రసంగాల్లోనూ నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలే కీలకంగా చోటుచేసుకున్నాయి. కార్పొరేట్ల అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు అమలవుతున్న ఈ విధానాలను మరింతగా ముందుకు తీసుకుపోవడమే తమ లక్ష్యమని ఇరువురు నేతలూ ప్రకటించారు. దీంతో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల తరువాత వీరిద్దరిలో ఎవరు అధికారంలోకి వచ్చినా రాష్ట్రం సంస్కరణల బాటనే ప్రయాణించక తప్పదని తేలిపోయింది. మంగళవారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల బతుకులు బాగుపడే వరకు యుద్ధం చేస్తానని ప్రకటించారు. పేద ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేస్తున్న ఆర్థిక సంస్కరణలను ఒకవైపు మోస్తూ, మరోవైపు ఎవరితో యుద్ధం చేస్తారో అర్థం కాని పరిస్థితి! ఇక మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తన సంకల్పం పేదరికం లేని సమాజమని చెబుతూనే సంస్కరణలను ఘనంగా కీర్తించారు. ఆయన అట్టహాసంగా విడుదల చేసిన విజన్ 2047 డాక్యుమెంట్టైతే అక్షరాలా నూతన ఆర్థిక విధానాలతో, కార్పొరేట్ల ప్రయోజనాలతో నిండిపోయింది. తెలుగు ప్రజలకు తానిచ్చే ఆయుధంగా దానిని ఆయన అభివర్ణించుకోవడం విడ్డూరం!

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఘనంగా చెప్పుకున్న విద్యావిధానంలో మార్పులన్నీ ప్రపంచబ్యాంకు ఊదరగొట్టిన సుభాషితాలే! ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలే తలకు మించి భారం కావడం వంటి పరిణామాలు కళ్ళ ముందు కనపడుతున్న సత్యాలు. ఉపాధ్యాయుల కొరత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాష్ట్రంలో పూర్తిస్థాయి డిఎస్‌సి నిర్వహించి ఎన్నేళ్లయిందో? ఒకప్పుడు ప్రపంచబ్యాంకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయగా, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ పని చేస్తోంది. మోడీ ప్రభుత్వం నుండి వస్తున్న ఆదేశాలను బిజెపి పాలిత రాష్ట్రాల కన్నా వేగంగా జగన్మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్నప్పుడు రాష్ట్రంలో అమలయ్యేవి ప్రపంచబ్యాంకు విధానాలు కాక మరేమిటి? విద్యాసంస్థల్లో కనీస వసతులు లేకపోయినా బైజూస్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, వర్చువల్ రియాల్టీ, అగ్‌మెంటెడ్ రియాల్టీ వంటి నేల విడిచి సాము చేసే కసరత్తులు ఆ విధానాల ఫలితమే! ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు చోటుచేసుకుంటున్న ఈ మార్పులు విద్యారంగంలో తీవ్ర అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. ఇక చంద్రబాబు తన విజన్ డాక్యుమెంట్‌లో స్కూళ్లను తగ్గించుకోవాలని స్పష్టంగా పేర్కొనడం దారుణం. మెడికల్ కళాశాలల సంఖ్య భారీగా పెరుగుతున్నప్పటికీ పేదలు, అణగారిన కులాల వారికి నామమాత్రపు ప్రయోజనం లేకుండా సర్కారీ వ్యాపారానికి తెరలేవడం సైతం బ్యాంకు విధానాల దుష్ఫలితమే! విద్యుత్ రంగంలో 1990వ దశకంలో ప్రారంభమైన సంస్కరణలనే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరింత వేగంగా కొనసాగిస్తోంది. వ్యవసాయ మోటర్లకు మీటర్ల ఏర్పాటు నుండి స్మార్ట్ మీటర్ల వరకు అప్పటి విధానాల కొనసాగింపే! వ్యవసాయం, వైద్యం వంటి కీలక రంగాలతో పాటు, పట్టణ సంస్కరణలకూ రెడ్‌కార్పెట్ పరిచిన రాష్ట్ర ప్రభుత్వం చెత్తపన్నునూ ప్రజానీకంపై రుద్దింది. వీటన్నింటికీ సమిధలవుతున్నది పేదలు కాగా, వారి తరపునే తాను యుద్ధం చేస్తున్నానని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించుకోవడాన్ని ఏమనాలి?

రాష్ట్రంలో సంస్కరణలకు ఆద్యుడినని ప్రకటించుకున్న చంద్రబాబు, 2047 విజన్ డాక్యుమెంట్‌లో వాటినే మరింత తీవ్రంగా ప్రతిపాదించారు. నూతన ఆర్థిక విధానాలతో సంపద సృష్టి జరుగుతున్నా అది పేదలకు అందడం లేదని కూడా ఆయనే చెప్పడం గమనార్హం. అయినా, సంస్కరణలను అమలు చేసి తీరుతాననడం ఎవరి ప్రయోజనాల కోసమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విద్యుత్ రంగంలో అమలు చేసిన సంస్కరణల దుష్ఫలితాలను చవిచూసిన రాష్ట్ర ప్రజానీకం సమైక్య రాష్ట్రంలో ఉవ్వెత్తున ఎగిసి వాటిని తిప్పికొట్టింది. ఆ విధానాలనే అమలు చేసి తీరుతామని అధికార, ప్రతిపక్ష పార్టీలు నిస్సిగ్గుగా చెప్పడాన్ని రాష్ట్ర ప్రజానీకం గుర్తించాలి. తిప్పికొట్టడానికి మరోసారి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి. అందుకు రానున్న ఎన్నికలే సరైన వేదిక.

మహనీయుల మాట



వెలిగే దీపమే ఇతర దీపాలను
వెలిగించినట్టు,
నిరంతరం నేర్చుకొనేవారే
ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.
- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వ కవి.
Rabindranath Tagore

మైనారిటీలను వేటాడుతున్న మెజారిటీ మత రాజకీయాలు

సమస్య

1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి భారత దేశం స్వాతంత్ర్యం పొందినట్లు ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసినప్పుడు ...దేశ విభజనను గుర్తు చేస్తూ అల్లర్లు జరిగాయి. ఆ అల్లర్ల సాక్షిగా పుట్టిన దేశంలో నేడు అధికారంలో ఉన్న వారి నాయకత్వంలో అల్లర్లు జరుగుతున్నాయి.

సామాజిక ఐక్యతను విచ్ఛిన్నం చేసి విభజనకు నాంది పలికేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో దేశం 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటోంది. స్వాతంత్ర్య పోరాటంలో భాగమైన కోట్లాది మంది దేశభక్తులు భారత ప్రజలందరికి కొత్త, మెరుగైన జీవితం లభిస్తుందని ఆశపడ్డారు. పేదరికం, దోపిడీ లేని భారతదేశంలో మతతత్వం, మత విద్వేషం, కులతత్వం వంటి సాంఘిక దురాచారాలు నిర్మూలించబడతాయని, ప్రజాస్వామ్య హక్కులు విస్తరించబడతాయని కూడా వారు కలలు కన్నారు. అయితే స్వాతంత్ర్య పోరాటానికి సహకరించని ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బిజెపి పాలనలో...స్వాతంత్ర్య పోరాటం ద్వారా వృద్ధి చేసుకున్న ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాన్య ప్రజల శ్రేయస్సు, సామ్రాజ్యవాద వ్యతిరేకత వంటి విలువలన్నీ నేడు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. కార్పొరేట్ ప్రయోజనాలను మాత్రమే పరిరక్షించే నిరంకుశ హిందూ రాష్ట్రాన్ని స్థాపించడమే బిజెపి లక్ష్యం. నరేంద్ర మోడీ పరిపాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక సంప్రదాయాన్ని నిలబెట్టే రాజ్యాంగాన్నే తిరగరాసే ఎత్తుగడ జరుగుతోంది. బహుళ త్వం, సహనంతో నిండిన భారతీయ సంస్కృతి దాడికి గురవు తోంది. మతం ఆధారంగా పౌరసత్వాన్ని ఇచ్చేలా పౌరసత్వ సవరణ చట్టం, ఏకరూప పౌర స్మృతిని ప్రవేశపెట్టే చర్యలు చేపడుతోంది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదా రద్దు చేయబడింది. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించబడింది.

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఉద్దేశపూర్వకంగానే మతపరమైన అల్లర్లను సృష్టించి ప్రజలను విభజించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మతపరమైన, జాతిపరమైన అల్లర్లు అన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్నాయి. స్వేచ్ఛాయుతమైన చర్చకు అనుమతి ఇవ్వకుండా, ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిని సస్పెండ్ చేయడం, సాధారణ ప్రసంగాలను సైతం నిషేధించడం ద్వారా నియంతృత్వ తరహా పోకడలకు పోతున్నది. లోక్‌సభకు అవిశ్వాస తీర్మానంపై చర్చకు రావడానికి కూడా సిద్ధంగా లేని ప్రధాని నేడు మనకున్నారు. సుప్రీంకోర్టు తీర్పులను కొట్టివేయడానికి చర్చ లేకుండానే పార్లమెంటులో చట్టాలను ప్రవేశపెడుతున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను ఆలస్యం చేస్తూ తనకు నచ్చిన వ్యక్తులను న్యాయమూర్తులుగా నియమించడంలో మోడీ ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఎన్నికల సంఘాన్ని అధికార పార్టీకి అనుకూలంగా నడిచే సంస్థగా మార్చారు. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎన్‌ఐఎ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి సాధనాలుగా మార్చారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టేందుకు అవసరమైతే దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం అనుసరించిన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని మోడీ ప్రభుత్వం విడిచిపెట్టింది. భారతదేశం అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా మారిపోయింది. కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించేందుకు సన్యాసులను, అర్చకులను రప్పించి ప్రధాని రాజదండం అమర్చారు. బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు మత మార్పిడులను, మతాంతర వివాహాలను నిషేధిస్తూ చట్టాలు తీసుకు వస్తున్నాయి. మూఢనమ్మకాలు, అపోహలకు ప్రాధాన్యతనిస్తూ, సైన్స్‌ను మినహాయించే విద్యా విధానం అమలు చేయబడుతున్నది.

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఉద్దేశపూర్వకంగానే మతపరమైన అల్లర్లను సృష్టించి ప్రజలను విభజించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మతపరమైన, జాతిపరమైన అల్లర్లు అన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్నాయి. స్వేచ్ఛాయుతమైన చర్చకు అనుమతి ఇవ్వకుండా, ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిని సస్పెండ్ చేయడం, సాధారణ ప్రసంగాలను సైతం నిషేధించడం ద్వారా నియంతృత్వ తరహా పోకడలకు పోతున్నది.

బిజెపి ప్రభుత్వ ఆర్థిక విధానాలు ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్లకు మేలు చేసేలా వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచవగ్గా కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయి. కార్పొరేట్లకు భారీ పన్ను మినహాయింపునిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలు పెరిగిపోవడంతో మోడీకి అనుకూలమైన కార్పొరేట్ల సంపద అత్యంత వేగంగా రెట్టింపయింది.

బుల్డోజర్లతో మైనారిటీలపై వేట

భవనాల కూల్చివేతలకు నిబంధనలు ఉన్నాయని కోర్టులు తరచూ గుర్తు చేస్తుంటాయి. బుల్డోజర్ రాజ్‌పై ఇతర హైకోర్టులు, సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు వినడం లేదు. ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మొదలెట్టిన బుల్డోజర్ పద్ధతి అస్సాం, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, గుజరాత్, మణిపూర్‌లకు విస్తరించింది.

మణిపూర్ రాజుకుంది బుల్డోజర్ రాజ్‌తోనే....

మణిపూర్‌లో వివాదాలు మొదలైంది బుల్డోజర్ రాజ్‌తోనే. 2023 ఫిబ్రవరి 24న, చురచంద్‌పూర్ లోని సాంగ్‌జాంగ్ గ్రామంలో అటవీ భూమిని ఆక్రమించారని 16 కుకి కుటుంబాల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇంట్లోని వస్తువులను తెచ్చుకోడానికి కూడా వీల్లేకుండా ఇళ్లను కూల్చివేశారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి.

మైనారిటీ ప్రాంతాలే టార్గెట్

బిజెపి ఢిల్లీలో బుల్డోజర్లతో మైనారిటీ ప్రాంతాలను టార్గెట్ చేసింది. హనుమాన్ జయంతి ఊరేగింపు సందర్భంగా మత ఉద్రిక్తత సృష్టించిన సంఘ్ పరివార్ జహంగీర్‌పురిలో భవనాలను నేలమట్టం చేసింది. పోలీసుల సహాయంతో కూల్చివేతను సుప్రీంకోర్టు నిలిపివేసింది. అయితే కూల్చివేత గంటన్నర పాటు కొనసాగింది.

గుజరాత్‌లో ప్రార్థనా స్థలాల ధ్వంసం

కచ్ ప్రాంతంలో ఆరు మదర్సాలు నేలమట్టమయ్యాయి. రామనవమి సందర్భంగా సంఘ్‌పరివార్ సృష్టించిన ఘర్షణల ముసుగులో హిమ్మత్‌నగర్, వడోదర, సకర్‌పురా తదితర ప్రాంతాల్లోని మైనారిటీల ఇళ్లను, సంస్థలను, ప్రార్థనా స్థలాలను బుల్డోజర్‌తో ధ్వంసం చేశారు.

మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్‌లోని ఒక మసీదులో రామనవమి వేడుకల సందర్భంగా కాషాయ జెండాను ఎగురవేశారు. మసీదులో కాషాయ జెండాను కట్టడంతో ఘర్షణ చెలరేగింది. దీనికి సంబంధించిన 47 కేసుల్లో 177 మందిని అరెస్టు చేశారు. అనుమానితులుగా భావించి ముస్లింల 57 దుకాణాలు, ఇళ్లను పోలీసులు కూల్చివేశారు. రామనవమి ఘర్షణల ముసుగులో, సంఘ్ పరివార్ అల్లర్ల తర్వాత ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించి 92 ముస్లింల భవనాలను కూల్చివేసింది.

బుల్డోజర్ బాబా

ఆదిత్యనాథ్ యూపీ ముఖ్యమంత్రి అయిన బుల్డోజర్ రాజ్‌ను ప్రారంభించారు. ఇది 2017-2021లో విస్తృతంగా వ్యాపించింది. 2022 ఎన్నికల్లో ఆదిత్యనాథ్‌ను బుల్డోజర్ బాబాగా అభివర్ణించారు. నేరగాళ్లను అణచివేస్తామని ప్రకటించినప్పటికీ...ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిపై మాత్రం బుల్డోజర్ ప్రయోగించారు.

బిజెపి అధికార ప్రతినిధి నూపుర్ శర్మ దూషణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనను అణిచివేసేందుకు బుల్డోజర్లను ఉపయోగించారు. సహరాన్‌పూర్, కాన్పూర్‌లో జరిగిన నిరసనల్లో నిందితుల ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఆరేళ్లలో పెద్ద పెద్ద భవనాలు సహా దాదాపు 500 ఇళ్లు నేలమట్టమయ్యాయి.

అక్కడ దళితులకు ఆలయ ప్రవేశం లేదు

మధ్యప్రదేశ్‌లో, దళితులు శివరాత్రి నాడు దేవాలయాలలోకి ప్రవేశించకుండా నిషేధించారు. ఖర్గోన్ జిల్లాలోని చాప్రా గ్రామంలోని శివాలయంలోకి దళితులను రానీయకుండా అగ్రవర్ణాలకు చెందిన వారు అడ్డుకున్నారు.

సెమ్రా గ్రామంలోని రామజానకి ఆలయంలో నిర్వహించిన సామూహిక విందులో దళిత కుటుంబానికి ఆహారం నిరాకరించబడింది. వాస్తవానికి దళిత సంఘాలతో పాటు గ్రామంలోని ప్రతి ఒక్కరి నుంచి విరాళాలు స్వీకరించి విందు నిర్వహించారు.

బిజెపి నాయకుడు ప్రవేశ్ శుక్లా సిద్ధి జిల్లాలో గిరిజన యువకుడి ముఖంపై మూత్ర విసర్జన చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జాతీయ స్థాయిలో నిరసనలు వెల్లువెత్తడంతో అతడిని అరెస్ట్ చేశారు.

జోధ్‌పూర్‌లో బోర్‌వెల్ నుండి నీరు తోడుకున్నందుకు నలభై ఆరేళ్ల కిషన్‌లాల్ భీల్‌ని కొట్టి చంపారు.

ప్రాణం పోయాకా... అవమానమే...

వడోదరలో, కుటుంబాన్ని బహిరంగ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించకుండా నిషేధించారు. కుల దూషణలకు పాల్పడ్డారు.

ఉత్తరప్రదేశ్‌లో ప్రిన్సిపాల్ వాటర్ బాటిల్ లోంచి నీళ్లు తాగినందుకు ఓ విద్యార్థిని కొట్టారు. బిజ్నోర్ జిల్లాలోని చామన్‌దేవి ఇంటర్ కాలేజీలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మణిపూర్‌లో అల్లర్లకు అంతే లేదు

మణిపూర్‌లో బిజెపి చీలిక రాజకీయాల కారణంగా 100 రోజులు దాటినా అల్లర్లకు అంతు లేదు. ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనకు గానీ, ఈ అంశంపై కచ్చితమైన సమాధానం చెప్పేందుకు గానీ సిద్ధంగా లేరు. రిజర్వేషన్ సహా డిమాండ్ల ద్వారా మైతీ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడంతో ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న అరంబై తెంగ్‌కోల్, మైతీ లీపున్ వంటి అతివాద సంస్థలు అల్లర్లను ప్రారంభించాయి. భారీ సంఖ్యలో క్రైస్తవ చర్చిలు, సంస్థలు నాశనం చేయబడ్డాయి. రెండు వందల మందికి పైగా చనిపోయారు. 60,000 మందికి పైగా పారిపోయారు. మణిపూర్ మహిళలు ఏ క్షణంలోనైనా సామూహిక అత్యాచారం, హత్యకు గురయ్యే భయంకరమైన పరిస్థితిలో ఉన్నారు.

హర్యానాలోనూ వేట

హర్యానా లోని నుహ్ జిల్లాలో రెండు వారాల క్రితం మొదలైన మత కలహాలు కొనసాగుతున్నాయి. బజరంగ్‌దళ్, విహెచ్‌పి ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిజ్‌మండల్ జలాభిషేక యాత్రలో పాల్గొన్నవారు ఈ ఘర్షణలను ప్రారంభించారు. ముఠా సభ్యులు కత్తులు, కర్రలు సహా ఆయుధాలతో వచ్చారు. మైనారిటీలు అధికంగా వున్న ప్రాంతాల్లో ఒకటైన నుహ్ జిల్లాలోకి యాత్ర ప్రవేశించిన వెంటనే అల్లర్లు మొదలయ్యాయి. ఆవుల దొంగ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు యువకులను దహనం చేసిన కేసులో నిందితుడు మోను మానేసర్, అతని బృందం యాత్రలో పాల్గొనడంతో పాటు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టర్ వివాదానికి దారితీసింది. ఘర్షణను నిరోధించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాలు కూడా నిందితులకే సహాయపడ్డాయి. ఆలయంలో 3,000 మందిని బందీలుగా ఉంచారన్న రాష్ట్ర హోంమంత్రి ప్రకటనతో సమీపంలోని గుర్గావ్, ఫరీదాబాద్, పాల్వాల్ వంటి జిల్లాలకు అల్లర్లు వ్యాపించాయి. గుర్గావ్‌లో దాడి చేసిన వ్యక్తులు మసీదుకు నిప్పంటించి, ఇమామ్‌ను కాల్చి చంపారు. పల్వాల్ జిల్లాలో కూడా పలు మసీదులపై దాడులు జరిగాయి. ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. హర్యానాలో వివాదం తర్వాత రాజస్థాన్‌లో కూడా ఘర్షణలు జరిగాయి. అల్వార్ జిల్లాలో ఒక గుంపు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను ధ్వంసం చేసింది. ఈద్ వేడుకలకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ వచ్చి రెండు నెలల క్రితం జోధ్‌పూర్, అల్వార్, కరోలీ జిల్లాల్లో ఉద్రిక్తత సృష్టించింది.

మనుస్మృతిని రాజ్యాంగబద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్న సంఘ్ పరివార్ సంస్థలు దళితులను మనుషులుగా చూసేందుకు ఇప్పటికీ ఇష్టపడడం లేదు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా ఉత్తర భారతదేశం లోని అనేక ప్రాంతాల్లో అంటరానితనం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం దేశంలో దళితులపై హింస పెరిగిపోతోంది. నాలుగేళ్లలో 1,89,000 కేసులు నమోదయ్యాయి. దళితులపై 54 శాతం నేరాలు యు.పి, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో జరుగుతున్నాయి. నేరస్తులకు శిక్ష తప్పడం వల్ల దాడుల సంఖ్య పెరుగుతున్నది.

ఇది మోడీ అండ్ కో బుల్డోజర్ రాజ్ తీరు!
ఇంకా చూస్తూనే వుందామా!!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

★

ఎదురుదాడి సమస్యకు పరిష్కారమా?

అభిప్రాయం

మణిపూర్‌పై ప్రధాని నోరు విప్పడానికి ఏకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాల్సి వచ్చింది. ఐనప్పటికీ దిద్దుబాటు చర్యలు వుండబోతున్నాయన్న సంకేతాలు రాలేదు సరికదా, పూర్తిగా ప్రతి విమర్శలకే పరిమితమయ్యారు. సాక్షాత్తూ ప్రధానే ప్రశ్నించిన వారిపై ఎదురు దాడికి దిగితే పరివారమంతా అదే చేస్తుందిగా! రాహుల్ గాంధీ చేసిన ఒక సంజ్ఞను...ఫ్లయింగ్ కిస్‌గా భావించి భంగపడిన స్మృతి ఇరానీ గారికి మహిళలను నగ్నంగా ఊరేగించినా బాధ కలగలేదు! ఇన్నేళ్ల మోడీ పాలనలో ప్రధానంగా కనిపిస్తున్నది ఏమంటే... అన్యాయాన్ని వ్యతిరేకించిన వారిపైనే దాడి జరుగుతున్నది. ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటనను దేశం కళ్ళారా చూసింది. జరిగిన 72 రోజుల తర్వాత గాని ఈ అంశం బాహ్య ప్రపంచం దృష్టికి రాలేదు.

జరిగిన అఘాయిత్యాలను, జరగని పోలీసుల చర్యలను ఖండించడం ఒక బాధ్యత. అలా ఖండించినప్పుడు మోడీ అంధభక్తులు విద్వేషాలతో ఊగిపోతున్నారు. ఇలాంటి సంఘటనలు మరొక రాష్ట్రంలో జరగలేదా? మానభంగాలు, మర్డర్లు మరెక్కడా జరగలేదా? అంటూ సమర్ధించుకుంటూ ఎదురు ప్రశ్నలు సంధిస్తున్నారు. మహిళలపై జరిగిన అకృత్యాలను సమర్థించుకునేదా సంస్కారం అంటే? మహిళలకు జరిగిన అన్యాయాలపై తిరగబడిన ఒక యువకుడి తల నరికి ఇంటి ముందున్న తడికెకు వేలాడదీసిన ఫోటో జులై 22వ తారీకున ఓ తెలుగు పత్రికలో దర్శనమిచ్చింది. వెంటనే భక్తులు రంగంలోకి దిగి "కాశ్మీరీ పండిట్లకు జరిగిన అన్యాయం సంగతి చెప్పండి" అంటున్నారు. జరుగుతున్న అన్యాయాలన్నింటికీ చారిత్రక తప్పిదాలే సమాధానాలా? బిజెపి నాయకురాలు విజయశాంతి, తెలంగాణ ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ లాంటివాళ్ళు ట్విట్టర్ వేదికగా ఈ అంశాన్ని ఖండించినందుకు వారిని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. ఇదేనా సంస్కారం అంటే? జగన్మాత, భారత మాత, కాళీమాత అంటూ ఏవేవో పేర్లు పెట్టి మహిళలకు గౌరవం ఇస్తున్నట్టుగా ఫోజులు కొట్టేవాళ్ళు మహిళలపై జరుగుతున్న దాడులను



కనీసం ఖండించడానికి మొహం చాటేస్తున్నారు. ఇది సిగ్గుచేటు కాదా? మత ఛాందసవాదులు, ముఖ్యంగా రాజకీయాలను మతంతో ముడిపెట్టి, మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలను నడిపిస్తున్న నేటి పాలకులు వారి అనుయాయులు, వారి మాధ్యమాలు ఎన్నడూ మహిళల గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎందుకంటే ఆధిపత్య భావజాలంలో అది అసాధ్యం.

ఇక తమ ఆగడాలను కప్పిపుచ్చుకోవడానికి దేశం, మతం అభద్రతలో ఉన్నాయనే ముసుగును కప్పుకుంటున్నారు. 'దేశంలోకి మయన్మార్ ప్రాంతం నుండి రోహింగ్యాలు చొరబడుతున్నారు. ఇది మయన్మార్, చైనాల కుట్ర' అంటూ అసత్య ప్రచారాలతో ఊదరగొడుతున్నారు. పదేళ్ల నుంచి పాలిస్తున్న వారు, దేశ సరిహద్దులను తమ హద్దులలో పెట్టుకున్న వారు, ఈ మాట అంటుంటే నమ్మడానికి మనకున్న వివేకం ఏమైనట్లు. ప్రతి సంఘటనను విదేశీ కుట్రతో ముడి పెట్టడం కుసంస్కారం కాదా? ఇక మణిపూర్‌లో హిందూ మతం అభద్రతలో పడిందంటూ క్రైస్తవ మతం ఆధిపత్యం చెలాయిస్తుందంటూ మరో అసత్య వాదనకు నిస్సిగ్గుగా తెర తీస్తున్నారు. మైదాన ప్రాంతంలో నివసించే వారంతా మైతేయులని, వారంతా హిందువులని, అదేవిధంగా కొండ ప్రాంతాల్లో నివసించే వారంతా కుకీ జాతికి చెందిన గిరిజన క్రైస్తవులని తెలుస్తుంది. దేశంలో ఎక్కడైనా కొండ ప్రాంతంలో ఉన్న వారికి రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. కొండ ప్రాంతంలో ఉన్న భూమిని ఇతరులు ఎవరూ కొనకుండా 370 అధికరణం కింద ఆంక్షలు ఉన్నాయి. మరి ఈ రోజు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మైదానంలో ఉండే మైతేయులకు ఎస్టీ హోదా కల్పించడంలో ఉన్న ఆంతర్యం ఏమంటే కొండ ప్రాంతాల్లో కూడా వాళ్ళు భూమిని కొనవచ్చు, సొంతం చేసుకోవచ్చు. కొండ లోయల్లో విరివిగా పండే నల్ల మందు వంటి వాణిజ్య పంటలను, విలువైన ఖనిజాలను హస్తగతం చేసుకోవడం కోసమే కదా ఈ రకమైన రాజకీయ ఎత్తుగడ బిజెపి ప్రభుత్వం వేసింది! పేదరికపు నిష్పత్తి గిరిజనులకు మించిన స్థాయిలో మిగతా సమూహాల్లో ఉన్నదా? అయినప్పటికీ బిజెపి రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా తన రాజకీయ నిర్ణయాన్ని ఏ నాటి నుంచో ప్రకటిస్తూనే ఉన్నది. ఇది చాలదా వారి అసలైన ఆంతర్యాన్ని అర్థం చేసుకోవడానికి? ఈ ఆర్థిక ఆధిపత్యపు అంశాన్ని పక్కనపెట్టి...జాతుల మధ్య, మతాల మధ్య జరుగుతున్న రచ్చగా బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఇది తెలియని అంధ భక్తులు హిందూ మతం ప్రమాదంలో పడింది, భవిష్యత్తులో ఇతర మతాలు ఆధిపత్యం చెలాయిస్తాయి, అనే న్యూనతాభావంతో అనవసర విద్వేషాలకు లోనవుతున్నారు.

మూడు నెలల నుంచి జరుగుతున్న ఈ సంఘటనలు ప్రపంచ దృష్టిని ఆకర్షించి భారతదేశ పరువును బజార్లో పెట్టాయి. భారతదేశంలో మత సహనం లేదని, ఒక్క మణిపూర్ లోనే 250 పైగా చర్చిలు కూల్చబడ్డాయని ఐక్యరాజ్యసమితిలో చర్చ జరిగింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంట్లో, ఇంగ్లాండ్ లోని హౌస్ ఆఫ్ కామన్స్ సభలో ఇదే రకమైన చర్చ జరుగుతోంది. ఇలాంటి పర్యవసానాలు దేశానికి నష్టదాయకం కావా?

మణిపూర్ ప్రజలపై నిప్పుల వర్షం కురుస్తుంటే కర్ణాటక ఎన్నికల ర్యాలీలో పూలజల్లు కురిపించుకోవడానికి పరుగులు తీసిన పెద్దలు దీనికి బాధ్యత వహించాలి. పంతాలు, పట్టింపుల కన్నా పరిష్కారానికి చొరవ చూపాల్సిన సమయం, సందర్భం ఇది.

- జి. తిరుపతయ్య

ఉద్యమం

పద్నాలుగేళ్లగా ఊరిస్తున్న
పూర్ణపాడు-లాబేసు వంతెన

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావాలంటే ప్రాణాలనే పణంగా పెట్టాల్సి వస్తోంది. నాగావళి నదిని దాటాల్సి రావడమే ఇందుకు కారణం. దాంతో ఈ మండలంలోని 31 పంచాయితీలకుగాను 9 పంచాయితీలకు చెందిన 22 గ్రామాల ప్రజలు, పరోక్షంగా మరో 40 గ్రామాల గిరిజనులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

1996లో రెబ్బ-వనధార సమీపంలోని వనిజ గ్రామం వద్ద నాగావళి నదిని దాటుతుండగా నాటు పడవ మునిగిపోయి 36 మంది గిరిజనులు మృతి చెందారు. ఈ ఘటన జరిగి ఇప్పటికి 27 సంవత్సరాలైనా వీరి కష్టాలు మాత్రం తీరలేదు. ఈ నెల నాల్గవ తేదీన అనారోగ్యంతో బాధపడుతున్న రెబ్బ గ్రామ బాలిక కోలక మరియమ్మకు వైద్యం చేయించేందుకు ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు తెప్ప కట్టి నాగావళి నదిని దాటి ప్రాణం కాపాడుకు న్నారు. అదే వరద ఉధృతి ఎక్కువగా ఉంటే ప్రాణనష్టం జరిగేది. నది అవతల గ్రామాల ప్రజలు కొమరాడ మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం రావాలంటే సుమారు 70 కిలోమీటర్ల దూరం కురుపాం, పార్వతీపురం మీదుగా తిరిగి రావాల్సిన దుస్థితి. అదే నాగావళి నదిపై వంతెన నిర్మిస్తే ఆ భారం పూర్తిగా తగ్గిపోతుంది. 1996లో పడవ మునిగిపోయిన సందర్భంలో అప్పటి ప్రభుత్వం గిరిజనుల కష్టాలు తీర్చడానికి పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి మరిచింది. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని సిపిఎం ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తినప్పుడు రూ.3.50 కోట్లు నిధులు మంజూరై పనులు ప్రారంభించారు. పద్నాలుగేళ్లయినా నేటికీ వంతెన మాత్రం పూర్తి కాలేదు. పెండింగ్ పనుల విషయంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇది పూర్తిగా పాలకుల నిర్లక్ష్యంగానే కనిపిస్తోంది.

నేటి నుంచి ఆందోళనలు

ఈ ఏడాది జూన్‌లో కురుపాం నియోజకవర్గంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్... మూడు మండలాలను కలిపి పలు గ్రామాలకు ఉపయోగపడే ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి ఒక్క మాట మాట్లాడలేదు. ఒడిశా ప్రభుత్వం ఆ రాష్ట్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో కరడ గ్రామం సమీపంలో వనిజ గ్రామం దగ్గర రెండేళ్లలోనే బ్రిడ్జి పూర్తి చేసింది. మన రాష్ట్రంలో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పార్టీలకతీతంగా ఐక్యంగా పోరాడాలి. ఇప్పటికైనా పాలకులు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రూ.14 కోట్ల నిధులు కేటా యించి కాంట్రాక్టర్‌ను రప్పించి వంతెన పనులు పున:ప్రారంభించాలి. పూర్ణపాడు-లాబేసు వంతెన పోరాట సాధన కమిటీ అందుకుగాను ఈ నెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు మండలంలోని కోమట్లపేట గ్రామం దగ్గర రిలే నిరాహారదీక్షలు చేపట్టనుంది. 28వ తేదీ ఉదయం 10 గంటలకు కొమరాడలో నిరసన ర్యాలీ, తాశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా జరగనున్నాయి. ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటేనే పాలకులు దిగొస్తారు. పోరాటం జయప్రదం అవుతుంది.

- వి. ఇందిర,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు,
పార్వతీపురం మన్యం జిల్లా.

★

కెజిబివి విద్యార్థినికి అరుదైన అవకాశం

ఐక్యరాజ్యసమితి సదస్సులో ప్రసంగించనున్న మనస్విని

మనస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సామల మనస్వినికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలో నిర్వహించే ఐక్యరాజ్యసమితి సదస్సులో ఆమె పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానం ద్వారా మన్యం జిల్లాలో విద్యార్థులు ఏ విధంగా లబ్ధిపొందుతున్నారో ప్రసంగించనుంది. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఆ విద్యార్థి మనస్వినిని అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 10 మంది విద్యార్థులతో కూడిన ప్రతినిధి బృందాన్ని పంపాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 105 మంది విద్యార్థులకు రాత పరీక్ష రాయగా వారిలో పది మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో ముఖ్యమంత్రి ప్రత్యేక సిఫార్సుతో 9వ తరగతి చదువుతున్న మనస్విని ఎంపిక చేసినట్లు వివరించారు. ఐరాస కేంద్ర కార్యాలయంలో సెప్టెంబరు 18, 19 తేదీలలో జనరల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై ఉన్నత స్థాయి రాజకీయ ఫోరంలో పాల్గొంటారని, నాడు-నేడు (పాఠశాల విద్య) కార్యక్రమాలపై ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనడం ద్వారా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, బాలికల అభివృద్ధి అధికారి కె.రోజారమణ, ప్రిన్సిపల్ సిహెచ్. శ్రీరంజని, పిఇటి ఎన్.అరుణజ్యోతి పాల్గొన్నారు.

'పందెం' సర్వేలు

- రాజకీయపార్టీలే కాదు... పందేల కోసమూ సర్వేలు
- హీటెక్కుతున్న ఉమ్మడి అనంత జిల్లా రాజకీయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'డబ్బులు ఊరికే రావు' అన్న నానుడి ఇటీవల కాలంలో పెద్దఎత్తున ప్రచారంలోనున్న విషయం తెలిసిందే. ఆయాచితంగా పందేలు కాయడంతోనే డబ్బులు రావని భావించారో ఏమో కొంత మంది పందేలు కాయడానికి సైతం సర్వేలు నిర్వహిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. దీని ఆధారంగా వచ్చే ఎన్నికల్లో పందేలు కాయడానికి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

గత ఎన్నికల సమయంలోనూ ఇదే రకమైన ఎత్తుగడతో కొన్ని కోట్ల రూపాయలు దక్కించుకున్నారు. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పందెం కాసే పెద్ద వాళ్లు కూడా ముందుగానే పెట్టుబడి కింద సర్వేలు సొంతంగా నిర్వహించుకునేందుకు పనిలోనున్నారు. దీనికయ్యే ఖర్చును కూడా సొంతంగా భరించి, ఏ నియోజకవర్గంలో ఏ రకంగా ఉండబోతున్నది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా ఏ తరహా ప్రజలు ఏమనుకుంటున్నారన్నది సర్వేల ద్వారా విశ్లేషించుకునే పనిలోనున్నారు. అదే విధంగా కులాల వారీగానూ సర్వేలను సేకరిస్తున్నారు. అన్ని విధాలుగా సర్వేలు నిరంతరంగా నిర్వహించుకుంటూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా తాము పందేలకు సిద్ధమయ్యే విధంగా పావులు కదుపుతుండటం గమనార్హం. క్రికెట్ బెట్టింగులగాను జట్టు గెలుపోటములు మొదలుకుని బంతికి ఎన్ని పరుగులు వస్తాయి అన్నింటిపైనా పందేలు కాయడం చూస్తుంటాం. ఇక్కడ కూడా వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లలో అధికారంలోకి వస్తుంది మొదలుకుని ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది ఇలా అన్ని రకాల పందేలు కాసేందుకు ఈ సర్వేలు నిర్వహించుకుంటున్నారు. రాజకీయ పార్టీలతో సమానంగా బెట్టింగ్‌రాయుళ్లు సిద్ధమవుతున్నారు. ఇలా ఉంటే ఇటీవల రాజకీయపార్టీలు కూడా నిరంతరాయంగా సర్వేలు నిర్వహిస్తున్నాయి. కొన్ని ఆన్‌లైన్ అభిప్రాయ సేకరణ చేస్తుండగా, కొంత క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ సర్వేలు ముమ్మరం చేశాయి. ఇందు కోసం ప్రత్యేకంగా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆయా సంస్థలు క్షేత్ర స్థాయికెళ్లి అన్ని రకాల వివరాలను సేకరిస్తున్నాయి. అందులో అభ్యర్థులు, ఆయా రాజకీయపార్టీల పట్ల ప్రజలు ఏమనుకుంటున్నారన్న అన్ని రకాల వివరాలను సేకరించి విశ్లేషించుకుంటున్నాయి. తద్వారా ప్రతికూలంగా ఉన్నట్టు గుర్తించిన వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు ఏ రకమైన చర్యలు చేపట్టాలన్న దానిపై దృష్టి సారించాయి. తమకు అనుకూలంగా ఉంటే పరోక్షంగా ఇతరుల ద్వారా బయటకు లీకులిచ్చి సానుకూల వాతావరణాన్ని మరింత పెంచుకునే పనిని చేపడుతున్నాయి. ఇక ఒక సంస్థ అయితే ఇచ్చే ఫలితంపై నమ్మకం వస్తుందో...రాదోనన్న భయంతో మూడు, నాలుగు సంస్థలతో వేర్వేరుగా సర్వేలు నిర్వహిస్తున్నాయి. వైసిపి ఈ రకంగా నాలుగు సంస్థలు ప్రస్తుతం సర్వేలు నిర్వహిస్తున్నట్టు అధికారపార్టీలోనే చర్చ సాగుతోంది. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా ఇదే బాటలో పయనిస్తోంది. అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందన్న అభిప్రాయ సేకరణ కూడా ఆన్‌లైన్ ద్వారా చేపడుతోంది. ఈ రకంగా ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సర్వే మయంగా మారుతోంది. దీని ఆధారంగానే టికెట్లు కేటాయింపులు ఉంటాయన్న ప్రచారం సాగుతుండంతో ఆశావహుల్లో రోజు తమ పేర్లు వచ్చేలా విధంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కొద్దిమంది నాయకులు తమపైనే సొంత సర్వేలను నిర్వహించుకునే పనిలోనున్నారు. ఇలా అందరూ సర్వేలపై సర్వేలు నిర్వహించుకుని ప్రజాభిప్రాయ సేకరణ పైనే ఆధారపడటం చర్చనీయాంశంగానూ మారుతోంది.

చిరుత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మడకశిర (అనంతపురం)

అనంతపురం జిల్లా మడకశిర మండల పరిధిలోని మెళవాయి కొండ ప్రాంతంలోని పొలంలో చిరుత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతిచెందిన చిరుతను గమనించిన రైతులు అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. చిరుత మృతికి గల కారణాలు తెలపాల్సిన ఫారెస్ట్ అధికారులు సుమారు 12 గంటలు గడిచిన స్పందించలేదు. విషప్రయోగం జరిగిందా? వేటగాళ్ల బారిన పడిందా?లేక అనారోగ్యంతో మృతిచెందిందా? అన్న సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులు తెలపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు మేయర్ ఓటు తొలగింపు..!

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగర ప్రథమ పౌరుడైన మేయర్ బివై.రామయ్య ఓటు హక్కు ఓటర్ జాబితాలో నుండి తొలగించడం పట్ల చర్చనీయాంశమైంది. తన ఓటు హక్కును తొలగించడం పట్ల నగర మేయర్ బివై.రామయ్య ఓటర్ నమోదు అధికారులపై మండిపడ్డారు. హుటాహుటిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి ఓటు హక్కు తొలగింపుపై ఫిర్యాదు చేశారు. తన ఓటు హక్కును తొలగించిన వారిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 2021 మార్చిలో కర్నూలు నగర పాలక సంస్థ ఎన్నికల్లో కార్పొరేటరుగా, మేయరుగా ఎన్నికై, ఒక నగరానికి ప్రథమ పౌరుడిగా ఉన్న తన ఓటరు కార్డే జాబితాలో తొలగించటం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. తనకే ఇలా చేదు అనుభవం ఎదురైతే, క్షేత్ర స్థాయిలో సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసిపి నాయకుని దౌర్జన్యం

- బిల్లులు చెల్లించలేదని హెచ్‌ఎంపై ఆగ్రహం
- విద్యార్థులను బయటకు పంపించి తరగతి గదులకు తాళాలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

పాఠశాల మరమ్మతు పనుల బిల్లులు చెల్లించలేదని అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడు ఉగ్రరూపం ప్రదర్శించాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, తాను పనులు చేసిన తరగతి గదిలో పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయులు, వింటున్న విద్యార్థులను బయటకు పంపించి మరీ గదికి తాళాలు వేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన వైసిపి నాయకుడు, వార్డు సభ్యురాలి భర్త దుప్పల శ్రీనివాస్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2019-20, 2020-21 సంవత్సరాల్లో మరమ్మతులు పనులు చేశారు. ఇందుకు సంబంధించిన సుమారు రూ.1.43 లక్షల బిల్లులు చెల్లించాలని పాఠశాల సిబ్బందిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయులుగా చేసిన వారు బదిలీ కావడంతో, ఇటీవల ఆ స్థానంలో కె.విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్ బుధవారం పాఠశాలకు వెళ్లి తనకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని హెచ్‌ఎంను కోరారు. తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని, పనుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాక వారి సూచనల మేరకు చర్యలు తీసుకోగలనని చెప్పారు. దీంతో ఆయన కోపంతో రెండు తరగతి గదుల్లోకి వెళ్లి పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయులు ఎం.శ్రీరామ్, బి.హేమలతను, విద్యార్థులను బలవంతంగా బయటకు పంపించారు. అనంతరం పాఠశాల గదులకు తాళం వేసి వెళ్లిపోయారు. దీనిపై ప్రశ్నించిన హెచ్‌ఎంపై దురుసుగా ప్రవర్తించారు. విషయాన్ని హెచ్‌ఎం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎంఇఒ-2 డి.చిన్నారావు పాఠశాలలో విచారణ చేపట్టారు.

మన్యంలో పులి సంచారం

భయాందోళన చెందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో ఏనుగులతో సతమతమవుతున్న ఆదివాసీలను మరో భయం పట్టుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం దోనుబాయి సమీపంలో బుధవారం పెద్దపులి సంచరించింది. పుబ్బాడ, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బడిగం మీదుగా కొరమ వైపు పులి వెళ్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే దోనుబాయి గుగ్గిలం తోటలో పెద్దపులి అడుగు జాడలను పరిశీలించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు.

భామిని మండలంలోని కొరమ గ్రామ సమీపంలోని క్వారీ పరిసరాలలో పులి అడుగుజాడలు స్థానికులను కలవర పెడుతున్నాయి. స్థానిక క్వారీలో ఉండే వాచ్‌మెన్ బుధవారం తెల్లవారుజామున పులి సంచరించినట్లు కనిపించిందని, భయంతో పూర్తి స్థాయిలో ఆ జంతువును పరిశీలించలేదని తెలిపాడు. అటవీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించగా పులి అడుగుజాడలుగా తెలియజేశారు. వెంటనే సమాచారాన్ని తహశీల్దార్ ఎన్.అప్పారావుకు తెలియజేయడంతో కొరమ పరిసర గ్రామాలలో టామ్ టామ్ వేసి, ప్రజలను అప్రమత్తం చేశారు. క్వారీ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు

తేది: 14.08.2023 ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం.డివై.సిఇ/జిఎస్/ఎస్‌సి/24/2023/ఓటి
PUB/0923

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరపున 08.09.2023, 14.00గం. వరకు క్రింద పేర్కొన్న పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించమైనది.

క్ర.సం.: 1. ఇ-టెండర్ నం.: 22-జిఎస్-ఎస్‌సి-23-ఓటి. పని పేరు : సికింద్రాబాద్ డివిజన్-గాటి శక్తి యూనిట్-జిఏడిల అభివృద్ధి మరియు తయారీ కోసం కన్సల్టెన్సీ సేవలుబీ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక, ఫౌండేషన్ కోసం వివరణాత్మక డ్రాయింగ్‌ల తయారీ మరియు డిజైన్, వయాడక్ట్ స్పాన్స్ మరియు అప్రోచ్‌లతో సహా రోడ్ ఓవర్ బ్రిడ్జ్ / రోడ్ అండర్ బ్రిడ్జ్ యొక్క ఉప-నిర్మాణం మరియు సూపర్ స్ట్రక్చర్; రీన్‌ఫోర్స్డ్ ఎర్త్ వాల్ మరియు రిటైనింగ్ వాల్ డిజైన్; ఫౌండేషన్, స్ట్రక్చరల్ మరియు ఆర్‌ఇ వాల్ / రిటైనింగ్ వాల్ డిజైన్ యొక్క రుజువు తనిఖీబీ బిఓక్యూ తయారీ; వివరణాత్మక అంచనా తయారి; తుది స్థాన సర్వే నిర్వహించడం; భూసేకరణ ప్రతిపాదనల తయారీ; కాజీపేట - బల్హార్షా విభాగంలో ఎల్‌సి నం.8,9,13,15,17,38,42,44, 45 మరియు 79 (10 సంఖ్యలు)కి బదులుగా సంబంధిత కోడ్‌లు / మాన్యువల్‌ల ప్రకారం ఆర్‌ఓబిల నిర్మాణానికి జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ మరియు టెక్నికల్ స్పెసిఫికేషన్‌లతో బిడ్ డాక్యుమెంట్‌ను తయారు చేయడం. సుమారు టెండర్ విలువ రూ.లో : 1,41,48,380/-, ధరవత్తు డిపాజిట్ మొత్తం (రూ.) : 2,20,800/-, పూర్తి కాలం నెలల్లో : 3 నెలలు. నిర్వహణ కాలం నెలల్లో : 06 నెలలు. ప్రామాణిక అర్హత ప్రమాణాలకు సంబంధించి పనులు సారూప్యంగా పరిగణించబడతాయి : డిపిఆర్ తయారీ, రైల్వే వంతెన/ఆర్‌ఓబి/ఎఫ్‌ఓబి రూపకల్పన మరియు డ్రాయింగ్.

1. టెండరర్లు ఇ-టెంటరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్లు ఏవీ పరిగణించబడవు. 2. భావి టెండరర్లందరూ ఆన్‌లైన్ చెల్లింపులు ద్వారా మాత్రమే ఇఎమ్‌డి చెల్లించాలని అభ్యర్థించడమైనది.
3. ఏ విధమైన కారణం చెప్పకుండానే టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వే కు ఉంది.
4. భావి టెండరర్లందరూ జిఎస్‌టిఐఎన్ గుర్తింపు నం.లు. పొందాలని మరియు వారి ఆఫర్‌తో పాటు సమర్పించాలని సూచించబడ్డారు.

డివై.చీఫ్ ఇంజనీర్/గాటి శక్తి/ సికింద్రాబాద్.

ఇ-టెండర్ నోటీసు ఆహ్వానం (http://ireps.gov.in ద్వారా)
PUB/0926

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ తరపున టెండరింగ్‌లో సిగ్నల్ పాకెట్ సిస్టమ్ లో క్రింది పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

Date : 14-08-2023

For Hemadri Cements Limited
sd/-
Dr Ananda Balasubramaniyan
Managing Director
DIN: 02702557

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుడు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు [illegible]

క్ర. సం	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1	శ్రీ. చిగురుపాటి రంగారావు, తండ్రి. చిగురుపాటి విశ్వనాథం, డో.నం.10-46, 3వ అంతస్తు, బ్లూ బెల్స్ పార్క్, పోరంకి సాలిపేట రోడ్డు, పెనమలూరు, విజయ డైరీ వద్ద, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521137. ఇక్కడ కూడా : శ్రీ చిగురుపాటి రంగారావు, తండ్రి. చిగురుపాటి విశ్వనాథం, డో.నం.68, ఆరెగూడెం, నేలకొండపల్లి, ఖమ్మం, తెలంగాణ-507160, ఇక్కడ కూడా : శ్రీ.చిగురుపాటి రంగారావు, తండ్రి. చిగురుపాటి విశ్వనాథం, డో.నం.10/255సి, నాగవరప్పాడు, కొలుసు సుబ్బారావు వీధి ఎదురు, వార్డు నం.10, ద్వారక అపార్ట్‌మెంట్ వద్ద, గుడివాడ, ఆంధ్రప్రదేశ్-521301. ఇక్కడ కూడా : శ్రీ. చిగురుపాటి రంగారావు, తండ్రి. చిగురుపాటి విశ్వనాథం, డో.నం.5-455/5, ఫ్లాట్ నం.501, ద్వారక కృష్ణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, ఆర్.ఎస్.నం.227, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 2 2. శ్రీమతి. చిగురుపాటి జ్యోతి, భర్త. చిగురుపాటి రంగారావు, డో.నం.10-46, 3వ అంతస్తు, బ్లూ బెల్స్ పార్క్, పోరంకి సాలిపేట రోడ్డు, పెనమలూరు, విజయ డైరి వద్ద, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521137. ఇక్కడ కూడా : శ్రీమతి. చిగురుపాటి జ్యోతి, భర్త. చిగురుపాటి రంగారావు, డో.నం.10/196కె, రాజేంద్ర నగర్, ఏలూరు రోడ్డు, ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద, గుడివాడ, ఆంధ్రప్రదేశ్-521301. ఇక్కడ కూడా : శ్రీమతి. చిగురుపాటి జ్యోతి, భర్త. చిగురుపాటి రంగారావు, డో.నం.10/255సి, నాగవరప్పాడు, కొలుసు సుబ్బారావు వీధి ఎదురు, వార్డు నం.10, ద్వారక అపార్ట్‌మెంట్ వద్ద, గుడివాడ, ఆంధ్రప్రదేశ్-521301. ఇక్కడ కూడా : శ్రీమతి. చిగురుపాటి జ్యోతి, భర్త. చిగురుపాటి రంగారావు, డో.నం.5-455/5, ఫ్లాట్ నం.501, ద్వారకా కృష్ణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, ఆర్.ఎస్.నం.227, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. డిమాండ్ నోటీసు తేది: 19.04.2023 [illegible] లోన్ ఎకౌంట్ నెం.: PHR006905445343	రూ.37,89,278/- (ముప్పై ఏడు లక్షల ఎనభై తొమ్మిది వేల రెండు వందల డెభై ఎనిమిది రూపాయలు మాత్రమే)	గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, మంగళగిరి రెవెన్యూ గ్రామం, మంగళగిరి మున్సిపల్ ఏరియా పరిధిలోని ఆస్తి మొత్తం డో.నం.5-455/5, ఆర్.ఎస్.నం.227, ద్వారకా కృష్ణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, 4వ అంతస్తులో ఫ్లాట్ నం.501, ఉన్న ప్లింత్ ఏరియా 925 చ.అ.లు., కామన్ ఏరియా 225 చ.అ.లు., పార్కింగ్ ఏరియా 125 చ.అ.లు., తో కలిసి అవిభక్త మరియు పేర్కొనబడని సైట్ విస్తీర్ణం 47.73 చ.గ.లు. మొత్తం నుండి బయటకు 947.60 చ.గ.లు. లేదా 792.31 చ.మీ.లు. క్రింది విధమైన సరిహద్దులు : షెడ్యూల్-ఎ (మొత్తం సైట్ కొరకు) : తూర్పు: ఫుల్ గాస్పెల్ చర్చ్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం యొక్క ఆస్తి, దక్షిణం: ఆత్మకూరు వైపు రోడ్డుకు ప్రక్కనే ఉన్న మార్జిన్ సరిహద్దు, పడమర: తోట నాగమ్మ ద్వారా ఇతరులకు విక్రయించబడిన ఆస్తి, ఉత్తరం : ప్రగాడ సరోజిని ద్వారా ఇతరులకు విక్రయించబడిన ఆస్తి. షెడ్యూల్-బి (మొత్తం ఆస్తి కొరకు) : తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై. [illegible] స్వాధీనత తేది : 11.08.2023
4.	శ్రీ. వెమిరెడ్డి [illegible] డిమాండ్ నోటీసు తేది : 27.04.2023 [illegible] లోన్ ఎకౌంట్ నెం.: PHR006900428585	రూ.5,33,599/- [illegible]	[illegible] స్వాధీనత తేది : 11.08.2023

తేది: 17.08.2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

కృష్ణ జన్మభూమి వద్ద నిర్మాణాల తొలగింపునకు బ్రేక్

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఉన్న శ్రీకృష్ణ జన్మభూమి సమీపంలో నాయి బస్తీలో రైల్వేశాఖ తొలగిస్తున్న అక్రమ నిర్మాణాల ప్రక్రియను నిలిపేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పది రోజులపాటు కూల్చివేత ప్రక్రియను నిలుపుదల చేయాలని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. 66 ఏళ్ల యాకుబ్ షా వేసిన పిటిషన్ ఆధారంగా కోర్టు ఈ తీర్పునిచ్చింది. నాయి బస్తీ ప్రాంతంలో తమ కుటుంబాలు 1,880 నుంచి నివసిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఆగస్టు 9 నుంచి రైల్వేశాఖ తొలగింపు ప్రక్రియ చేపట్టింది. ఈ కేసులో వచ్చే వారం మళ్లీ వాదనలు కొనసాగనున్నాయి. షా తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంతో చంద్ర సేన్ వాదిస్తున్నారు. కౌశిక్ చౌదరీ, రాధా తార్కర్, ఆరన్ షాలు న్యాయవాదులుగా ఉన్నారు.

'కోటా'లో మరో విద్యార్థి ఆత్మహత్య

- ఈ ఏడాదిలో 22వ ఘటన

జైపూర్ : ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీహార్‌లోని గయకు చెందిన 18 ఏళ్ల వాల్మీకి జాంగిద్‌గా మృతుడ్ని గుర్తించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో ప్రవేశం కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్ పరీక్ష కోసం కోటాలోని కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అతడు చదువుతున్నాడు. దీని కోసం గతేడాది నుంచి మహానగర్ ప్రాంతంలో ఉంటున్నాడు. అయితే ప్రిపరేషన్ ఒత్తిడి వల్ల మంగళవారం రాత్రి సూసైడ్ చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోచింగ్ హబ్ అయిన రాజస్థాన్‌లోని కోటాలో ఒత్తిడి వల్ల విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడటం కలకలం రేపుతున్నది. ఈ నెలలో నలుగురు విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 22 సంఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింటి. అలాగే విద్యార్థులకు సహాయం కోసం ఒక హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేసింది.

ప్రజల మధ్య చిచ్చు పెడుతోన్న బిజెపి : శరద్ పవార్

ముంబయి : ప్రజల మధ్య బిజెపి చిచ్చుపెడుతోందని, మతం, వర్గాల ప్రాతిపదికన విభజిస్తోందని ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల మధ్య ఆయన బుధవారం ఛత్రపతి శంభాజీనగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపిని ఎదుర్కొనేందుకు వ్యూహాన్ని రచించామన్నారు. విభజన దినోత్సవాన్ని జరుపుకోవాలనే నిర్ణయం సరికాదని పవార్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రలోని ప్రభుత్వాలను అస్థిరపరిచిందని విమర్శించారు. మణిపూర్ సున్నితమైన రాష్ట్రమని, మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్కడ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు దారుణమని, మణిపూర్‌పై ప్రధాని ఎక్కువ మాట్లాడి ఉండాల్సిందని అన్నారు.

నూహ్ మత ఘర్షణల కేసులో బజరంగ్‌దళ్ నేత అరెస్ట్

చండీఘర్ : గత నెల 31న హర్యానాలోని నూహ్ జిల్లాలో చెలరేగిన మతవరమైన హింసాకాండతో సంబంధమున్నదన్న ఆరోపణపై స్వయం ప్రకటిత గో సంరక్షకుడు, బజరంగ్‌దళ్ నాయకుడు బిట్టూ బజరంగి అలియాస్ రాజ్‌కుమార్‌ను హర్యానా పోలీసులు అరెస్ట్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం, అవమానించడం, అల్లర్లకు పాల్పడడం, భయపెట్టడం వంటి ఆరోపణలపై ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద, అలాగే ఆయుధాల చట్టం కింద ఆయనపై కేసులు నమోదు చేశారు. వీహెచ్‌పీ నిర్వహించిన ర్యాలీ సందర్భంగా బజరంగి, ఆయన అనుచరులు ఆయుధాలతో స్వైరవిహారం చేశారని, ముస్లింలపై దాడి చేశారని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బజరంగి, ఆయన అనుచరులు పోలీసు వాహనం నుండి ఆయుధాలను అపహరించి, అధికారులను బెదిరించారని చెప్పారు. బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్రను పురస్కరించుకొని బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ సంస్థలు నూహ్‌లో నిర్వహించిన ప్రదర్శన సందర్భంగా ఘర్షణలు జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇతర ప్రాంతాలకు కూడా హింసాకాండ వ్యాపించింది. ముస్లింల నివాస గృహాలు, దుకాణాలపై మతోన్మాదులు దాడులు జరిపారు. కాగా తాను మీరట్ వచ్చానంటూ బజరంగి జూలై 30న అనేక వీడియోలను సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేశారు. దీనికి సంబంధించి ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే ఆ తర్వాత బజరంగి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనను మంగళవారం పోలీసులు మరోసారి ప్రశ్నించి అరెస్ట్ చేశారు.

హిందూ యువతితో వెళ్లాడని...

- ముస్లిం యువకుడిపై మతోన్మాదుల దాడి

ముంబయి : హిందూ యువతితో బయటికి వెళ్లడమే ఆ ముస్లిం యువకుడు చేసిన నేరం. అంతే...మతోన్మాదులు పెట్రేగిపోయారు. ముంబయిలోని బాంద్రా టెర్మినస్ రైల్వే స్టేషన్‌లో అతనిపై దాడి చేసి చితకబాదారు. ఆ సమయంలో జై శ్రీరాం, లవ్ జిహాదీని ఆపండి అంటూ నినాదాలు చేశారు. యువకుడిపై దాడి చేయవద్దని ఆ బాలిక వేడుకుంటున్నా వారు కనికరం చూపలేదు. ఈ సంఘటన గత నెలలోనే జరిగినప్పటికీ మంగళవారం దానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. దుండగులు ఆ యువకుడిపై దాడి చేసి కొట్టి ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు తీసికెళ్లారు. ఈ ఘటన జూలై 21న జరిగిందని డీసీపీ దీక్షిత్ చెప్పారు. అయితే అది రైల్వే స్టేషన్‌లో జరిగినందున రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. రైల్వే పోలీసుల పరిధిలోని కేసు కావడంతో తాము కేసు నమోదు చేయలేదని వివరించారు. పోలీసుల కథనం ప్రకారం... యువతీ యువకులు తమ తమ ఇళ్లలో ఎవరికీ చెప్పకుండా బయటికి వచ్చారు.

అమలుకు నోచుకోని

ప్రధాని వాగ్దానాలెన్నో!

న్యూఢిల్లీ: ఎర్రకోట బురుజుల నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన చివరి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తూ కొన్ని వాగ్దానాలు చేశారు మునుపటి సంవత్సరాల్లో ఎర్రకోట ప్రాకారాల నుండి ఆయన చేసిన కొన్ని భారీ వాగ్దానాల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉన్నదీ ది వైర్ ఓ ఆసక్తికరమైన కథనం ప్రచురించింది.

స్వాతంత్ర్య దినోత్సం రోజులన ఎర్రకోట వద్ద ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

రైతుల ఆదాయం

మొదటిది, భారతదేశంలోని 70 శాతం మందికి సంబంధించిన అంశం, 2018లో రైతుల ఆదాయాన్ని స్వాతంత్ర్యం వచ్చిన 75వ సంవత్సరం నాటికి రెట్టింపు చేస్తామని - అంటే ఆగస్టు 2022లో చేసిన వాగ్దానం. మోడీ ప్రభుత్వం ఈ వాగ్దానాన్ని ఫిబ్రవరి 2016లో మళ్లీ 2022లో చేసింది. వ్యవసాయ మంత్రి రైతుల ఆదాయం రెండింతలు పెరిగిందని నరేంద్ర తోమర్ 2022 జూలైలో పార్లమెంటుకు చెప్పారు . అయినప్పటికీ, వారు 2016లో సంపాదించిన దానికి, 2022లో సంపాదించిన దాని మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని గుర్తించడానికి గణాంకాలు ఏవీ అందుబాటులో లేవు.

2019 జనవరి-డిసెంబర్ నాటి ఎన్‌ఎస్‌ఎస్‌ఓ డేటాను ఉటంకిస్తూ, 2022లో హిందూ బిజినెస్‌లైన్ ఇలా చెప్పింది , "2012-13లో రూ. 6,426తో పోల్చినప్పుడు వ్యవసాయ కుటుంబానికి అన్ని మూలాల నుండి సగటు నెలవారీ ఆదాయం రూ. 10,218గా అంచనా వేయబడింది." అంటే 2019లో వ్యవసాయ ఆదాయాలు గత ఏడు సంవత్సరాల కంటే 59 శాతం పెరిగాయి.

"రైతుల ఆదాయాన్ని 2015-16 స్థాయి నుండి రెట్టింపు చేయడానికి, 2015-16 నుండి 2022-23 వరకు ఆదాయం సంవత్సరానికి 10.4% చొప్పున పెరగాలి. దీనికి విరుద్ధంగా, 2012-13 : 2018-19 మధ్య కాలంలో రైతుల ఆదాయం సంవత్సరానికి 3 శాతం స్వల్ప వేగంతో వద్ధి చెందింది, గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం. 2023-24 బడ్జెట్‌లో "రైతుల ఆదాయం రెట్టింపు" వాగ్దానాన్ని కూడా ప్రస్తావించలేదు మరియు " మోదీ కాలంలో 2014-15 నుండి 2022-23 వరకు వ్యవసాయ వృద్ధి 3.47 మందగించడంతో" ఇది "దూరం" అనిపించింది. కల". 26 జనవరి 2021న గురుగ్రామ్‌లో కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తమ నిరసనలో భాగంగా గణతంత్ర దినోత్సవం రోజున ట్రాక్టర్ మార్చ్‌లో రైతులు పాల్గొన్నారు.

వన్ ర్యాంక్ వన్ పెన్షన్

వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్ ఒపి) అనేది రక్షణ దళాలకు సంబంధించిన ప్రభుత్వ కాలింగ్ కార్డ్. 2014లో అధికారంలోకి వస్తే మోడీ అమలు చేస్తానని చెప్పిన ఓఆర్‌ఓపీ వాగ్దానం .

2015 నాటికి, ప్రధాన మంత్రి తక్కువ ఉల్లాసంగా ఉన్నారు. 2015లో మన్ కీ బాత్ రేడియో ప్రసంగంలో మోడీ ఇలా అన్నారు , "40 సంవత్సరాలుగా, ఈ (ఓఆర్ ఒపి) ప్రశ్న అలాగే కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు ఏమీ జరగలేదు.

ఇది మనం అనుకున్నంత సులభం కాదు, సంక్లిష్టమైనది.మాజీ సైనిక సిబ్బందికి ఓఆర్ ఒపిబకాయిల చెల్లింపుపై 2022 నాటి తీర్పును పాటించాలని కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది మరియు ఫిబ్రవరి 28, 2024 నాటికి రూ. 28,000 కోట్ల విలువైన 2019-2022 బకాయిలను చెల్లించాలని కోరింది. డిసెంబర్ 2022లో ప్రభుత్వం సవరించింది . 25 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరేలా పెన్షన్ పథకం.

స్వచ్ఛ భారత్

2015లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తమ ప్రభుత్వం 2019 నాటికి దేశంలోని పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తుందని మోదీ చెప్పారు.తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రెండు కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని, 70వేల గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్)గా తీర్చిదిద్దామని చెప్పారు .

అక్టోబర్ 2, 2019న గ్రామీణ భారతదేశం బహిరంగ మల విసర్జన లేని భారత్‌గా ప్రకటించుకుంది.

"60 నెలల్లో 11 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించి 60 కోట్ల మందికి పైగా ప్రజలకు మరుగుదొడ్లు అందించాం. ఇది విని ప్రపంచం ఆశ్చర్యపోయింది, "అని అతను చెప్పాడు. 2011 జనాభా లెక్కల ప్రకారం, 70శాతం గ్రామీణ కుటుంబాలకు మరుగుదొడ్లు లేవు. ఇప్పుడు, స్వచ్ఛ భారత్ మిషన్ డేటాబేస్ ప్రకారం , భారతదేశంలోని 100 శాతం గృహాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి.

2022లో, ది వైర్ ప్రతి భారతీయ రాష్ట్రంలోని పారిశుద్ధ్య సంక్షోభాన్ని కవర్ చేస్తూ 24-భాగాల సిరీస్‌ని చేసింది . స్వచ్ఛ్ భారత్ మిషన్ వెబ్‌సైట్‌లు 30%కి పైగా తయారు చేసిన డేటాను ప్రదర్శిస్తున్నాయని , 2014 మరియు 2020 మధ్య 12 లక్షలకు పైగా 'నిర్మించిన' మరుగుదొడ్లు ఉనికిలో లేవని మరియు మరుగుదొడ్ల గురించి ఎటువంటి అవగాహన లేని లబ్ధిదారులు తమలో నిర్మించబడ్డారని ప్రాథమిక పరిశోధనల్లో కొన్ని తెలిపాయి.

హర్యానాలో మహిళా కోచ్ సస్పెన్షన్

మంత్రిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఫలితం

చండీఘర్ : లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ హర్యానా మంత్రి సందీప్ సింగ్‌పై ఆరోపణలు చేసిన మహిళా జూనియర్ అథ్లెటిక్ కోచ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ డైరెక్టర్ యశేంద్ర సింగ్ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. పంచకుల జిల్లా క్రీడా అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అథ్లెటిక్ కోచ్‌ను సస్పెండ్ చేశామని, ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఆ ఉత్తర్వులలో వివరించారు. అయితే సస్పెన్షన్‌కు కారణాలను అందులో తెలియజేయలేదు. వెంబడించడం, అక్రమంగా నిర్బంధించడం, లైంగిక వేధింపులు, భయపెట్టడం వంటి ఆరోపణలకు సంబంధించి సందీప్ సింగ్‌పై గత సంవత్సరం డిసెంబర్‌లో కోచ్ ఫిర్యాదు చేశారు. తన సస్పెన్షన్‌పై మహిళా కోచ్ స్పందిస్తూ 'అవును. నన్ను సస్పెండ్ చేశారు. కేసును ఉపసంహరించుకొని రాజీ చేసుకోవాలని నాపై బాగా ఒత్తిడి వచ్చింది. నన్ను ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పలేదు. ఈ చర్యను ఎందుకు తీసుకున్నారో నాకు తెలియదు. నాపై ఒత్తిడి తెచ్చేందుకే ప్రభుత్వం మరోసారి ఈ ప్రయత్నం చేసింది. కానీ నేను తలవంచను' అని స్పష్టం చేశారు.

రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : 'మోడీ' ఇంటిపేరుపై వ్యాఖ్యలు చేశారన్న కేసులో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. దీంతో ఇటీవల జరిగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పాల్గొన్నారు. కాగా, తాజాగా రక్షణశాఖపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి రాహుల్ ఎంపిక య్యారు. మార్చి నెలలో సభ్యత్వం కోల్పోకముందు కూడా రాహుల్ ఈ కమిటీలోనే సభ్యుడిగా ఉన్నారు. ఇందులోకి కాంగ్రెస్ ఎంపీ అమర్ సింగ్ కూడా నామినేట్ అయినట్లు లోక్‌సభ బులిటెన్ వెల్లడించింది. లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన ఆమ్‌ఆద్మీ తరపు ఎంపీ సుశీల్ కుమార్ రింకూ.. వ్యవసాయం, పశుసంవర్ధక, ఫుడ్ ప్రాసెసింగ్ స్టాండింగ్ కమిటీకి ఎంపికయ్యారు. ఇటీవల జలంధర్ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో రింకూ ఎన్నికయ్యారు. ఇక మార్చి నెలలో లోక్‌సభ సభ్యత్వం తిరిగి పొందిన ఎన్‌సీపీ ఎంపీ ఫైజల్ మొహమ్మద్.. వినియోగదారుల వ్యవహారాల స్టాండింగ్ కమిటీకి నామినేట్ అయ్యారు. 2019లో మోడీ ఇంటి పేరుపై చేసిన వ్యాఖ్యల కేసులో రెండేళ్ల జైలుశిక్ష పడటంతో ఈ ఏడాది మార్చి 24న రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. అయితే, ఆయనకు దిగువస్థాయి కోర్టు విధించిన శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో రాహుల్ సభ్యత్వాన్ని ఈ నెల 7న పునరుద్ధరించారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో పాల్గొని.. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ ప్రసంగించారు.

బిల్లు ఆమోదం పై జాప్యానికి నిరసనగా

ఇండోనేషియాలో ఇంటి పనివారి దీక్షలు

జకార్తా : ఇండోనేషియాలో ఇంటిపనివారలు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ నిరాహార దీక్షకు దిగారు. జకార్తాలో పార్లమెంట్‌కు ఎదురుగా వేసిన శిబిరాల్లో దాదాపు 40మంది డొమెస్టిక్ వర్కర్స్ అలయన్స్‌కి చెందిన కార్యకర్తలు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఇంటిపనివారల రక్షణకు సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంలో జాప్యాన్ని వారు నిరసించారు. రాజధాని జకార్తాతో పాటూ ఇతర ప్రధాన నగరాల్లో సోమవారం నిరశనలు జరిగాయి. బిల్లు ఆమోదం పొందేవరకు ప్రతి రోజూ ఇలా నిరశన చేపడతామని డొమెస్టిక్ వర్కర్ల నేషనల్ అడ్వకసీ నెట్‌వర్క్‌కి చెందిన లీటా అంగ్రాయిని చెప్పారు. ప్రభుత్వం నుండి వారికెలాంటి రక్షణ వుండడం లేదని ఆమె విమర్శించారు. పనిమనుష్యుల రక్షణ బిల్లును తక్షణమే ఆమోదించి చట్టంగా మార్చాలని ఆమె పార్లమెంట్ సభ్యులను కోరారు. బిల్లు అమోదంలో జాప్యం జరిగిన కొద్దీ మరింతమంది వర్కర్లు తీవ్రమైన హింస, వివక్షలకు గురవుతారని ఆమె హెచ్చరించారు. ఇండోనేషియాలో డొమెస్టిక్ వర్కర్లు ఎదుర్కొంటున్న సవాళ్ళను ప్రతిబింబించేలా వారు గడియారాలు, నేప్‌కిన్స్, ఇతర పారిశుధ్య పరికరాలను ప్రదర్శించారు. హింస, అవమానాలు, వివక్ష, దూషణలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు 2014లో డొమెస్టిక్ వర్కర్స్ బిల్లును పార్లమెంట్ సభ్యులు ప్రతిపాదించారు. అప్పటి నుండి కనీసం మూడుసార్లు ఈ బిల్లును ప్రాధాన్యతా జాబితాలో నుండి తొలగిస్తూనే వస్తున్నారు.

జకార్తాలో పార్లమెంట్‌కు ఎదురుగా ఆందోళన చేస్తున్న ఇంటి పనివారు

తాలిబన్ పాలకులపై విచారణ జరిపించాలి

- బాలికలకు చదువుకు నిరాకరించడం దారుణం
- ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత గార్డన్ బ్రౌన్

ఐక్యరాజ్య సమితి : ఆఫ్ఘన్ బాలికలు, మహిళలకు విద్య, ఉపాధిని నిరాకరిస్తూ తాలిబన్ నేతలు పాల్పడిన నేరాలకు గానూ వారిని అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసిసి) ప్రాసిక్యూట్ చేయాలని అంతర్జాతీయ విద్యా విభాగానికి ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత గార్డన్ బ్రౌన్ పేర్కొన్నారు. తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్‌ను స్వాధీనం చేసుకుని 15వ తేదీతో రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఈనాడు ప్రపంచంలో మహిళలు, బాలిక హక్కులు తీవ్రంగా ఉల్లంఘించబడుతున్నాయంటే అందుకు పాలకులే బాధ్యత వహించాలని అన్నారు. విద్య, ఉపాధిలను నిరాకరించడమంటే అది లింగ వివక్ష కిందకు వస్తుందని, దాన్ని మానవాళికి వ్యతిరేకంగా జరిగిన నేరంగా చూడాల్సి వుంటుందని అన్నారు. ఈ మేరకు ఐసిసి ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్‌కు లీగల్ ఒపీనియన్‌ను పంపినట్లు చెప్పారు. అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఈ అంశంపై దర్యాప్తు జరపాలని కోరారు. 1996 నుండి 2001 వరకు ఆఫ్ఘనిస్తాన్‌ను పాలించినపుడు కూడా తాలిబన్లు ఇలాగే ఇస్లామిక్ చటాల్టకి కఠినమైన భాష్యం చెబుతూ మహిళలపై ఆంక్షలు విధించారు. ఆరవ గ్రేడ్ తర్వాత ఆడపిల్లలు స్కూలుకు వెళ్ళరాదని, ఉద్యోగాలు చేయకూడదని, బహిరంగ ప్రదేశాలకు, జిమ్‌లకు, బ్యూటీ సెలూన్లకు వారు వెళ్లరాదని నిషేధం విధించారు. కాందహార్‌లో తాలిబన్ సుప్రీం నేత హిబతుల్లా అఖుంద్జాను కలిసేందుకు ముస్లిం మత పెద్దల ప్రతినిధి బృందాన్ని పంపాల్సిందిగా బ్రౌన్ ముస్లిం దేశాలను కోరారు. మహిళలకు విద్య, ఉపాధులను నిషేధించాలని ఖురాన్‌లో ఎక్కడా పేర్కొనలేదని ఆయనకు వివరించాలని, వెంటనే ఆ నిషేధాన్ని ఎత్తివేయాలని కోరాలని ఆయన సూచించారు. తాలిబన్ల ప్రభుత్వంలోనే ఈ అంశంపై చీలిక వున్నట్లు కనిపిస్తోందని అన్నారు. విద్యా శాఖలో, ప్రభుత్వంలో చాలా మంది బాలికల విద్యా హక్కులు పునరుద్ధరించాలని కోరుకుంటున్నారని అన్నారు.

చైనా, వియత్నాం మధ్య చీలిక తెచ్చేందుకు

అమెరికా కుతంత్రం

హనోయ్ : ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా పలుకుబడి పెరుగుతుండడంతో అమెరికా కొత్త ఎత్తు వేసింది. సోషలిస్టు దేశమైన వియత్నాంకు, చైనాకు మధ్య తంపులు పెట్టాలని అమెరికా చూస్తోంది. దీనిలో భాగంగానే బైడెన్ ఆకస్మికంగా వియత్నాం పర్యటనను ఏర్పాటుచేసుకున్నారు. చైనా, ఇతర సోషలిస్టు, ప్రగతిశీల దేశాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా జరుపుతున్న కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో భాగంగా, చైనా, వియత్నాంల మధ్య చీలిక తీసుకురావాలని వాషింగ్టన్‌లోని నేతలు భావిస్తున్నారు. చైనా, వియత్నాంలు సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో చైనాను అన్ని వైపుల నుండి చుట్టుముట్టేందుకు గానూ వియత్నాంను తమ వ్యూహంలోకి చేర్చుకోవాలని అమెరికా కృత నిశ్చయంతో వున్నట్లు కనిపిస్తోంది. వియత్నాం పట్ల ఏళ్ళ తరబడి ఈ చీలిక విధానాన్ని అమెరికా అనుసరిస్తూ వస్తోంది. అయితే ఇప్పటివరకు ఈ విధానం పెద్దగా విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో అమెరికా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అమెరికాతో చైనా వ్యతిరేక ఒప్పందం కుదుర్చుకోవడమన్నది వియత్నాం విదేశాంగ విధాన మార్గదర్శక సూత్రాలకు పూర్తి విరుద్ధంగా వుంది. అన్ని దేశాలతో శాంతియుత సహజీవనం సాగిస్తూ, ఏ మిలటరీ కూటమితో ఘర్షణ పెట్టుకోకుండా, ఏ ఇతర దేశంపైనా హింసకు పాల్పడకుండా జీవించాలన్నది వియత్నాం లక్ష్యంగా వుంది. అయినా కానీ వియత్నాంను తనవైపునకు లాగాలని అమెరికా చాలా పట్టుగా వుంది. అయితే, ఆసియాలో బైడెన్ ప్రభుత్వం ఉద్రిక్తతలను రెచ్చగొడుతుండడంతో సహకారం, శాంతి పంథాను అనుసరించాలని చైనా, వియత్నాం ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నెల 9, 10 తేదీల్లో వియత్నాం డిప్యూటీ విదేశాంగ మంత్రి, చైనా విదేశీ వ్యవహారాల ఉపమంత్రి సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను నిర్వచించారు.



106కి చేరిన కార్చిచ్చు మృతుల సంఖ్య

హవాయి: వారం రోజులుగా హవాయి ద్వీపాన్ని దహించివేస్తున్న భయానక కార్చిచ్చులో మృతుల సంఖ్య 106కి చేరింది. పెద్దయెత్తున ఎగసిపడుతున్న మంటల వల్ల చారిత్రిక పట్టణం లాహైనా కొద్ది గంటల్లోనే మొత్తం నాశనమైపోయింది. ఈ షాక్ నుంచి బాధితులు ఇప్పటికీ తేరుకోలేదు.

ఇంతటి విపత్తు సంభవిస్తే అమెరికా ప్రభుత్వానికి ఏమీ పట్టినట్టు లేదు. అధ్యక్షుడు బైడెన్ ఇప్పటివరకు ఆ ప్రాంతాన్ని సందర్శించలేదు. అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో బాధితులను పరామర్శించేందుకు వచ్చే సోమవారం సతీసమేతంగా వెళ్లానని బైడెన్ చెప్పారు. దీనికి ముందు అరకొర సాయం ప్రకటించారు. సహాయక చర్యలకు ఇబ్బంది కలగకూడదనే హవాయి ద్వీపాన్ని ఆలస్యంగా సందర్శిస్తున్నానని అధ్యక్షుడు చెప్పారు.

న్యూస్‌క్లిక్‌పై వేధింపులకు ఖండన

- 700 మందికి పైగా విద్యావేత్తలు, జడ్జీల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ : ప్రముఖ న్యూస్ పోర్టల్ న్యూస్ న్యూస్‌క్లిక్‌పై వేధింపులను 700 మంది పౌరులు, జర్నలిస్టులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, సీనియర్ జర్నలిస్టులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, శాస్త్రవేత్తలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'న్యూస్‌క్లిక్‌ను వేధించడం అనేది మన రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి. ప్రభుత్వ వైఫల్యాల గురించి పాఠకులకు తెలియజేయడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయడం, ప్రజాస్వామ్యంలో స్వతంత్ర జర్నలిజం యొక్క మనస్సాక్షికి సంబంధించిన పాత్రపై దాడి' గా ప్రకటనలో విమర్శించారు. సంతకం చేసిన వారిలో సీనియర్ పాత్రికేయులు జాన్ దయాల్, ఎన్. రామ్, ప్రేమ్ శంకర్ ఝా, సిద్ధార్థ్ వరదరాజన్, ఎం.కె. వేణు, సుధీంద్ర కులకర్ణి, పి. సాయినాథ్, వైష్ణ రాయ్, బెజవాడ విల్సన్ (జాతీయ కన్వీనర్, సఫాయి కరంచారీ ఆందోళన్), అరుణా రాయ్ (మజ్దో రాయ్) ఉన్నారు. కిసాన్ శక్తి సంఘటన్), సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, జస్టిస్ (రిటైర్డ్) కె. చంద్రు, కోలిన్ గోన్సాల్వేస్, ప్రశాంత్ భూషణ్, హర్ష్ మందర్, సయ్యదా హమీద్, ఇతర ప్రముఖులు ఉన్నారు. 'న్యూస్‌క్లిక్ ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, చర్యలపై క్లిష్టమైన కవరేజీని అందించింది. మన సమాజంలోని అత్యంత అణగారిన మరియు దోపిడీకి గురవుతున్న వర్గాలు, కార్మికులు, రైతుల పోరాటాలపై దృష్టి సారించింది' అని ప్రకటన తెలిపింది

'న్యూస్‌క్లిక్‌పై దాడిని మన రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి. ప్రజాస్వామ్యంలో స్వతంత్ర జర్నలిజం యొక్క మనస్సాక్షి పాత్రపై దాడి. ఇది అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడటానికి వీలు కల్పించే ఈ దేశ ప్రజల సమాచార హక్కుపై దాడి. దురదృష్టవశాత్తు, కార్పొరేట్ యాజమాన్యంలోని మీడియా యుగంలో, కార్పొరేట్ ప్రభావం లేని స్వతంత్ర జర్నలిజానికి స్థలం తగ్గిపోయింది' అని ప్రకటన తెలిపింది. న్యూస్‌క్లిక్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణలు కోర్టులో ప్రస్తుతం జరుగుతున్నప్పటికీ దుర్మార్గపు మీడియా న్యూస్‌క్లిక్‌పై విచారణ జరపడం మరింత దురదృష్టకరమని ప్రకటనలో తెలిపారు. 'న్యూస్‌క్లిక్‌ని లక్ష్యంగా చేసుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాము, మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాము' అని ప్రకటన తెలిపింది.

అమల్లోకి నెహ్రూ మెమోరియల్ పేరు మార్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోనినెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పేరును ప్రధానమంత్రుల స్మారక చిహ్నంగా మోడీ ప్రభుత్వం మార్చి వేసింది. బుధవారం నుంచి కొత్త పేరు అమలులోకి వచ్చింది. నెహ్రూ మరణానంతరం ఆయన నివాసాన్ని స్మారకచిహ్నంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం మార్చింది. 14 ప్రధాన మంత్రుల సేవలను గుర్తు చేస్తూ ప్రధానమంత్రి సంగ్రహాలయాన్ని మోడీ ప్రభుత్వం అక్కడే నిర్మించింది.

చౌకబారు ఎత్తుగడ : కాంగ్రెస్

నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పేరును అధికారికంగా ప్రధాన మంత్రి మ్యూజియం లైబ్రరీ సొసైటీగా మార్చడం పట్ల మోడీ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ బుధవారం విమర్శలు గుప్పించింది. ప్రధాని మోడీ.. నెహ్రూ వారసత్వాన్ని నాశనం చేయడం, నిరాకరించడమనే ఏకసూత్ర అజెండాతో ముందుకెళుతున్నారని ఆగ్రహించింది. నెహ్రూ వారసత్వంపై ప్రభుత్వ దాడి, అణచివేత కొనసాగినా జవహర్‌లాల్ నెహ్రూ ఘన వారసత్వం ఉనికిలో ఉంటుందని, రాబోయే తరాలకు నెహ్రూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని స్పష్టం చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ విషయంలో మోడీకి ఎన్నో భయాలు, అభద్రత వంటివి ఉన్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో, ఆధునిక భారత దేశ నిర్మాణంలో నెహ్రూ పాత్రను తోసిపుచ్చలేరని, దేశ ప్రజాస్వామ్య, లౌకిక విలువల పటిష్టం కోసం, శాస్త్ర సాంకేతిక పురోగమనానికి నెహ్రూ అందించిన సేవలను విస్మరించలేమని పేర్కొన్నారు.

మా నాన్న బాంబులు వేసిన మాట వాస్తవమే.. కానీ..

- బిజెపికి గట్టి కౌంటర్ ఇచ్చిన సచిన్ పైలట్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు రాజేశ్ పైలట్‌పై బిజెపి ఐటీ సెల్ ఇన్‌ఛార్జ్ అమిత్ మాలవీయ చేసిన ఆరోపణలపై ఆయన కుమారుడు, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ స్పందించారు. తన తండ్రి బాంబులు వేసిన మాట వాస్తవమేనని, అయితే, మాలవీయ చెప్పిన సమాచారం తప్పని స్పష్టం చేశారు. '1966 మార్చి 5న మిజోరాం రాజధాని ఐజ్వాల్ పై అప్పటి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పైలట్‌రాజేశ్ పైలట్, సురేశ్ కల్మాడీ లు బాంబుల వర్షం కురిపించారు. అనంతరం ఆ ఇద్దరినీ కాంగ్రెస్ పార్టీ ఎంపీలను చేసి మంత్రి పదవులు కట్టబెట్టింది' అంటూ అమిత్ మాలవీయ ఇటీవలే ఓ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన సచిన్ పైలట్.. మాలవీయ ఆరోపణలను ఖండించారు. తన తండ్రి బాంబులు వేసిన మాట వాస్తవమేనని, అయితే మాలవీయ చెప్పిన తేదీలు, వివరాలు తప్పని పేర్కొన్నారు. 'నిజమే మాలవీయ చెప్పినట్లు నా తండ్రి రాజేశ్ పైలట్ బాంబులు వేశారు. ఎయిర్ ఫోర్స్ పైలట్ గా 1971 ఇండో-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. తూర్పు పాకిస్థాన్ భూభాగంపై ఆయన బాంబులు వేశారు. వాస్తవానికి మా నాన్న 1966 అక్టోబర్ 29న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో చేరారు. కావాలంటే సర్టిఫికేట్ చూసుకోండి' అని సచిన్ పైలట్ వివరించారు. ఈ మేరకు తన తండ్రి ఎయిర్‌ఫోర్స్‌లో జాయిన్ అయిన సర్టిఫికెట్ ను ట్వీట్‌కు జోడించారు.

ఇల్లంద గ్రామంలో ప్రమాదానికి గురైన ఆటో

ఆటోను ఢీకొన్న లారీ..

- ఆరుగురు దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటోను లారీ ఢీకొనడంతో ఆరుగురు దుర్మరణం చెందిన ఘటన తెలంగాణ రాష్ట్రం వరం గల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో బుధవారం జరిగింది. వీరిలో ఐదుగురు బీహార్ నుంచి వలసవచ్చిన వారు, స్థానిక ఆటో డ్రైవర్ ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కొన్ని కుటుంబాలు 20 ఏళ్ల కిందట హైదరాబాదుకు వలస వచ్చాయి. ఆ కుటుంబాల్లోని కొందరు కొన్ని రోజుల కిందట వరంగల్ వచ్చారు. అడవుల్లో చెట్లపై తేనె తుట్టెలు తీసి రహదారుల వెంట తేనె విక్రయించి జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగా జాబోదు కురెరి (25), సురేష్ బీహార్ (50), నితీష్ మండల్ (20), మేరీ బీహార్ (20), రూప్‌చంద్ (35), అమీర్, వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ భట్టు శ్రీనివాస్(45) ఆటోను కిరాయికి మాట్లాడుకుని వర్ధన్నపేటకు బయలుదేరారు. ఇల్లంద గ్రామానికి చేరుకోగానే ఆటోను తొర్రూర్ వైపు నుంచి వరంగల్ వెళ్తున్న రాజస్థాన్ లారీ బలంగా ఢీకొంది. దీంతో డ్రైవర్‌తో సహా ఆటోలోని ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అమీర్‌ను గాయాలవడంతో మాక్స్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాల వద్ద దొరికిన ఆధారాలను పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వరంగల్ సిపి ఎవి రంగనాథ్ ఘటన స్థలిని పరిశీలించారు.

7 రైల్వే ప్రాజెక్టులకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు వెచ్చిస్తామని, ఇందులో రూ.20 వేల కోట్లను కేంద్రమే సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. 45 వేల నుండి 55 వేల వరకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయి. 181 నగరాల్లో గ్రీన్ ఇ-మొబిలిటి కోసం మౌలిక సదుపాయాలు పెంచాలని నిర్ణయించింది.

డిజిటల్ ఇండియాకు రూ.14,903 కోట్లు

డిజిటల్ ఇండియా పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.14,903 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అండ్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఫేజ్ (ఐఎస్ఈఏ) ప్రోగ్రామ్ కింద 2.65 లక్షల మందికి శిక్షణ అందిస్తారు. 1,787 విద్యాసంస్థలను అనుసంధానించి పనిచేస్తున్న నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఎన్ కె ఎన్) ఆధునికీకరణ చేస్తామన్నారు. డిజి లాకర్ కింద డిజిటల్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ సదుపాయం ఇకపై ఎంఎస్‌ఎంఈ, ఇతర సంస్థలకు అందుబాటులోకి వస్తుంది. టైర్ 2, 3 నగరాల్లో 1,200 స్టార్టప్‌లకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

మీకోసం

ఉప్పు జాడీలో రెండు పచ్చి మిరపకాయలు వేస్తే వర్షాకాలంలో ఉప్పు నుంచి వచ్చే తేమ ఉండదు.

జీవన సౌరభం

చదవడం తెలిస్తే.. ప్రతి మనిషి ఒక పుస్తకమే!

బాలల్లారా.. రారండి

పాపా, బాబూ రారండి
బుద్ధిగ, చక్కగ కూర్చోండి
అ ఆ ఇ ఈ దిద్దండి
తెలుగు భాషను నేర్వండి

అ.. అమ్మ, ఆ..ఆవు అనండి
తెలుగు పుస్తకం చదవండి
బాల గేయాలు పాడండి
బాల కోకిలలు మీరండి

నీతి పద్యాలు నేర్వండి
మంచి పౌరులుగ ఎదగండి
బాలల కథలు చదవండి
బాగుగ వివేకం పొందండి

పొడుపు కథలు విప్పండి
తెలివిని మీరు పెంచండి
సామెతలెన్నో వినరండి
ఆమెత మీకది తెలియండి

సభ్యతగా మీరు ఉండండి
స్నేహం విలువ ఎరుగండి
బంగరు బాలలు మీరండి
భావి భారతం మీదండి!

– జె.శ్యామల,
99896 01113

కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పదాలు ఇచ్చాం. వాటికి ఎదురుగా ఉన్న బాక్సులో నిలువు, అడ్డం వరుసలలో అవి కలిసిపోయాయి. వాటిని మీరు కనిపెట్టండి చూద్దాం..

eye
pony
yoyo
panda
arrow
parrot

v	a	r	r	o	w
y	o	y	o	y	l
n	k	d	e	y	e
o	n	p	t	a	t
p	a	r	r	o	t
p	a	n	d	a	s



అంకెలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ

ఎ.భవాని,
7వ తరగతి,
జెఎల్‌బి స్కూల్,
భీమవరం

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ పిల్లలు ఇప్పుడు ఇళ్లకు చేరారు..

ఆడుతూ పాడుతూ, అప్పటి వరకు తమ కళ్ల ముందే తిరుగుతున్న పిల్లలు ఒక్కసారిగా కనిపించకుండా పోయినప్పుడు ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఎటు వెళ్లారో.. ఏమై పోయారో తెలియని తమ ముద్దు బిడ్డల ఆచూకీ కోసం తల్లిదండ్రులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని వెతుకుతారు. వీధులన్నీ తిరుగుతారు. పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినా.. తమ వంతుగా బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు గాలిస్తుంటారు. అలా కనిపించకుండా పోయిన పిల్లలను తల్లిదండ్రుల దగ్గరకు చేరుస్తున్నారు హిమాన్షు నాగ్‌పాల్. ఉత్తరప్రదేశ్ వారణాసి ఐఎఎస్ అధికారిగా ఎన్నో పనులతో తీరిక లేకుండా ఉండే ఈయన, తప్పిపోయిన పిల్లలను వాళ్ల తల్లిదండ్రుల దగ్గరకు చేర్చడంలో విశేష కృషి చేస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ షామిల్ జిల్లా ఓ కుగ్రామంలో బార్బర్ షాపులో పనిచేస్తున్నాడు 12 ఏళ్ల షోయబ్. రోజూ షాపుకు వెళ్లి రావడం అతని దినచర్య. ఒక రోజు షాపు పక్కనే ఉన్న బస్ స్టేషనుకు వెళ్లి, ఓ బస్సులో ఎక్కి కూర్చొన్నాడు. బస్సు చివరి స్టాపు వరకు షోయబ్ దిగలేదు. అసలు ఆ బస్సు షోయబ్ ఎక్కాల్సింది కాదు. తీరా బస్సు దిగాక, అతను చేరాల్సిన గమ్యం ఎక్కడో చెప్పలేక పోయాడు. అక్కడితో ఆగక కొన్ని రోజులపాటు బస్సులు, రైళ్లలో ప్రయాణించి తను ఉన్న ప్రాంతానికి వెయ్యి కిలోమీటర్ల దూరంలోని వారణాసికి చేరుకున్నాడు. వెనక్కి వచ్చే మార్గం తెలియక, అక్కడే రైల్వే స్టేషనులో యాచన చేస్తూ గడుపుతున్నాడు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న షోయబ్‌ను బార్బర్ షాపుకు తీసుకెళ్లడం, తీసుకురావడం అతని సోదరుడి రహీమ్ పని. ఆ రోజు సోదరుడు రాకముందే షోయబ్ బయటికి వచ్చేసి బస్సు ఎక్కేశాడు. తమ్ముడి కోసం అన్న ఎంత ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. ఇదంతా 2019లో జరిగిన సంగతి.

ఈ నాలుగేళ్లలో షోయబ్ కుటుంబం ఎంతో వేదన అనుభవించింది. కొడుకును తలచుకుని ఆ తల్లి ఏడ్వని రోజు లేదు. అసలు బతికున్నాడో.. లేదోనన్న భయం ఆ కుటుంబాన్ని వెంటాడింది. ఈ పరిస్థితుల్లో.. రహీమ్‌కు ఈ ఏడాది జనవరిలో స్థానిక పోలీస్ స్టేషను నుంచి ఫోను కాల్ వచ్చింది. షోయబ్ ఆచూకీ తెలిసిందన్నది దాని సారాంశం. వీడియో కాల్‌లో షోయబ్‌ను చూసినప్పుడు ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. షోయబ్ తల్లి ఏడుస్తూనే ఉంది.

ఇలా షోయబ్ ఒక్కడే కాదు.. సుదూర ప్రాంతాల నుండి వారణాసికి చేరుకున్న చిన్నారుల్లో 700 మందికి పైగా బాలలను తిరిగి తమ గమ్యస్థానాలకు చేర్చడంలో హిమాన్షు పాత్ర ఎంతోవుంది. చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చడమే లక్ష్యంగా 'మిషన్ ముస్కాన్'ను ప్రారంభించారు.

యాచన వృత్తిలో వందల మంది చిన్నారులు

హర్యానా హిస్సార్ జిల్లాకు చెందిన హిమాన్షు 2019 ఐఎఎస్ బ్యాచ్ అధికారి. గతేడాదే వారణాసి చీఫ్

డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సిడిఒ)గా బాధ్యతలు తీసుకున్నారు. విధుల్లో భాగంగా నగరంలో పర్యటిస్తున్న ఆయనకు ట్రాఫిక్ కూడళ్ల వద్ద చిన్నారులు యాచించడం కనిపించింది. కాశీ వ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ఘాట్లలో కూడా చాలా మంది పిల్లలను ఆయన గమనించారు. వారి దగ్గరకు వెళ్లి వివరాలు అడిగితే ఇక్కడి వారు కాదని తెలిసింది. "ఫ్లైఓవర్ కింద ఉంటున్నామని, అమ్మానాన్న ఎక్కడ ఉంటారో తెలియదని ఆ పిల్లలు చెప్పినప్పుడు చాలా బాధేసింది. ఐదేళ్లుగా ఉంటున్న పిల్లలు కూడా ఇక్కడ ఉన్నారు. తెలంగాణా, ఆంధ్ర, కర్నాటక, అసోం రాష్ట్రాలతో పాటు నేపాల్ దేశం నుండి వచ్చిన పిల్లలు కూడా ఇక్కడ ఉన్నారు' అని చెప్పారు. హిమాన్షు. ఆ వెంటనే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

అధికారులంతా ఏకమై..

పిల్లలను వారి కుటుంబాలకు చేరవేసేందుకు 'చైల్డ్ డెవలప్‌మెంట్', 'సోషల్ వెల్ఫేర్', 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్', 'పోలీస్' విభాగాల నుండి 60 మంది అధికారులను ఒకచోట చేర్చారు. వీరంతా బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఘాట్లు, గుళ్లు, ట్రాఫిక్ కూడళ్లు, ఫ్లైఓవర్స్ దగ్గర ఉన్న పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యేలా కార్యాచరణ రూపొందించారు.

మానసిక వైకల్యంతో బాధపడే వారి పిల్లలతో మాట్లాడేందుకు మానసిక వైద్యులను కూడా ఇందులో భాగం చేశారు. పిల్లలు చెప్పిన వివరాలను బట్టి ఆయా రాష్ట్రాల స్థానిక జిల్లా పోలీస్ స్టేషన్లకు పిల్లల వివరాలు, ఫొటోలు పంపిస్తున్నారు. వారణాసి వచ్చి పిల్లలను తీసుకెళ్లలేని పేద కుటుంబాల పిల్లలను హిమాన్షు

తన సొంత ఖర్చులతో ఇంటికి చేరుస్తున్నారు.

ఆచూకీ తెలిసేవరకు పిల్లల సంరక్షణ

వివరాలు తెలియని పిల్లల బాగోగులు పట్టించుకోవడంలో కూడా హిమాన్షు కృషి ఎంతో ఉంది. 20 స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో మాట్లాడి, ఆ పిల్లలను అక్కడకు చేర్చారు. వారికి ఆహారం, బట్టలు, వసతితో పాటు నాణ్యమైన విద్య అందేలా చూస్తున్నారు. పిల్లల అభిరుచులను బట్టి వివిధ రకాల కళల్లో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా యంత్రాంగం నుండి నిధులు సేకరించి మరీ స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహిస్తున్నారు.

'5 నుండి 15 రోజుల వ్యవధిలో పిల్లలను వారి కుటుంబాలకు అందజేస్తున్నాం. మానసిక వైకల్యంతో బాధపడే పిల్లల ఆచూకీ కోసం వారి చేతివ్రేళ్ల ముద్రల సాయంతో ఆధార్ అడ్రస్ తెలుసుకుని పంపిస్తున్నాం. షోయబ్ విషయంలో అలాగే చేశాం. బిడ్డలు తిరిగి తమ ఇళ్లకు చేరిన క్షణంలో ఆ కుటుంబాల్లో కనిపిస్తున్న ఆనందం చూస్తుంటే చాలా సంతోషమేస్తోంది. 5 నుండి 18 ఏళ్ల పిల్లల్లో చాలామందిని వారి స్వస్థలాలకు పంపించాం. ఇది నిరంతరం జరిగేలా ప్రణాళికలు వేస్తున్నాం. ఏ బిడ్డా ఇంటికి దూరం కాకూడదు.' అంటున్న హిమాన్షు లాంటి అధికారులు పెద్ద అధికారులే కాదు, పెద్ద మనసున్న వారు కూడా.

నేను సమంత అభిమానిని

'నేను ఇంత వరకు ఎవరి అభిమానిని అని చెప్పలేదు. కానీ సమంత అభిమానిని అని చెప్పుకుంటాను' అని అన్నారు దర్శకుడు శివ నిర్వాణ. విజయ్ దేవరకొండ, సమంత హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ చిత్రం సెప్టెంబర్ 1న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ ఇటీవల మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శివ నిర్వాణ సినిమా విశేషాలు ముచ్చటించారు. "ఖుషి' సినిమా చూసేందుకు థియేటర్స్‌కు వెళ్లిన పెళ్లైన జంటలు, పెళ్లి కాని వారు, లైఫ్‌లో పెళ్లి చేసుకోకూడదని అనుకునే వారు.. అందరూ ఈ సినిమా చూశాక తమ లవ్ లైఫ్‌లోని మెమొరీస్‌ని షేర్ చేసుకుంటారు. సినిమా అంతా మీకు విజయ్, సమంత కాకుండా విప్లవ్, ఆరాధ్య కనిపిస్తారు. ఇదొక కొత్త కథ, ట్విస్ట్‌లు, టర్న్‌లు ఉంటాయని నేను చెప్పను. కానీ మీ మనసుకు హత్తుకునేలా ఉంటుంది. 'ఖుషి' మిమ్మల్ని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చాక ఇంకోసారి సినిమాకు వెళ్దామని అనిపిస్తుంది. ఏ ఇబ్బందీ లేకుండా ఫ్యామిలీ అంతా మా సినిమాను చూడొచ్చు. సినిమా పూర్తయ్యాక నాకొక మంచి ఫ్యామిలీ ఉందని మీ మీద మీకే ఒక ఇష్టం ఏర్పడుతుంది. ఈ కథను అనుకున్నట్లు తెరకెక్కించేందుకు నాకు దొరికిన రెండు డైమండ్స్ విజయ్, సమంత. 'అర్జున్ రెడ్డి' చూశాక విజయ్ మీద ఏర్పడిన ప్రేమంతా ఈ సినిమాలో చూపించాను. 'ఖుషి'లో రెండున్నర గంటలు ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ' అన్నారు.

డిసెంబర్ 8న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' విడుదల



హీరో విశ్వక్ సేన్, హీరోయిన్‌గా నేహా శెట్టి నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరపైకి రాబోతున్న ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. ఇక సినిమాకు సంబంధించిన టీజర్ ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. 'సుట్టంలా సూసి పోకల' అనే మొదటి లిరికల్ సాంగ్ కూడా చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేశారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కులకర్ణి ఈ పాటను ఆలపించారు. డిసెంబర్ 8వ తేదీన విడుదల విడుదల చేయనున్నట్లుగా చిత్రబృందం వెల్లడించింది.

'దేవర' భైరా వచ్చేశాడు..

ఎన్‌టిఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కిస్తోన్న తాజా సినిమా 'దేవర'. బుధవారం సైఫ్ అలీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా 'దేవర' నుంచి ఆయన ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. సముద్రం, అలలు మధ్యలో భైరా ఫస్ట్ లుక్ చూపించారు. ఇందులో సైఫ్ 'భైరా' అనే పాత్రలో నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కీలకపాత్రలో సైఫ్ అలీ ఖాన్ నటిస్తున్నారు. మలయాళీ నటుడు షైన్ టామ్ చాకో విలన్‌గా కనిపించనున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నందమూరి కళ్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'బెదురులంక 2012' ట్రైలర్ విడుదల

కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా నటించిన సినిమా 'బెదురులంక 2012'ను లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 25న ఈ సినిమా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రామ్‌చరణ్ విడుదలచేశారు. యుగాంతం పేరుతో కొత్త నాటకానికి తెర తీసిన పెద్దలకు శివ ఎలా బుద్ధి చెప్పాడు? అనేది కథ అని ట్రైలర్ చూస్తే అర్థం అవుతోంది. కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటిస్తున్న ఈ సినిమాలో అజయ్ ఘోష్, రాజ్ కుమార్ కసిరెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్, 'ఆటో' రామ్ ప్రసాద్ తదితరులు కీలక పాత్రలలో నటించారు.

జీవితంలో ఒడిదుడుకుల కలబోతే 'సత్య'

నవీన్ విజయకృష్ణ

'మూడు సంవత్సరాల క్రితం.. ఈ స్టేజీ ఎక్కుతానో, లేదో అని డౌట్‌లో ఉన్న రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆ సంవత్సరం జీవితంలో చాలా కోల్పోయాను. అక్కడి నుంచి మళ్లీ ఇక్కడివరకు వచ్చాను. నేను మీ అందరి కామెంట్లు చదివాను. ఇంత లావయ్యి మీ ముందుకు తిరిగి వచ్చాను. జీవితంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యం. నానమ్మ విజయనిర్మల, అమ్మ నేత్ర.. వీళ్లిద్దరూ నేనెప్పుడూ మంచి స్థాయిలో చూడాలనుకున్నాను. కానీ వాళ్లు బతికుండగా అది నెరవేర్చలేకపోయాను. అందుకే వెనక్కు వెళ్లకుండా మళ్లీ తిరిగి వచ్చాను. సత్య సినిమాతో కమ్‌బ్యాక్ ఇస్తున్నాను. నాకు మా నానమ్మే ఇన్‌స్పిరేషన్. తను యాక్టింగ్, డైరెక్షన్, స్పెషల్ ఎఫెక్ట్స్ అన్నీ చూసుకునేది. తను సినిమాలు చేసేటప్పుడు నేను సెట్స్‌లో ఉండేవాడిని. అవన్నీ చూసి నాకు డైరెక్టర్ అవ్వాలనిపించేది. కానీ తనకు మాత్రం నేను నటుడినవ్వాలని కోరుకుంది. అందుకే తనకోసం నటుడిగా ఎంట్రీ ఇచ్చాను. ఇప్పుడు డైరెక్టర్‌గా మారాను. సత్య సినిమా విషయానికి వస్తే జీవితంలో అందరికీ కష్టాలుంటాయి. మా అమ్మ, నానమ్మ కూడా ఎన్నో కష్టాలు పడ్డవారే! వాళ్లు ఫైటర్స్! వీరిద్దరూ నాకెప్పటికీ ఆదర్శం' అని చెప్పాడు నవీన్ విజయకృష్ణ.

హీరో సాయిధరమ్ తేజ్, స్వాతి జంటగా నటించిన చిత్రం సత్య. ఈ చిత్రానికి సీనియర్ నటుడు నరేశ్ తనయుడు నవీన్ విజయకృష్ణ దర్శకత్వం వహించారు. ఈ సినిమా నుంచి సోల్ ఆఫ్ సత్య అనే పాట విడుదల చేశారు. ఈ సాంగ్ రిలీజ్ కార్యక్రమంలో నవీన్ విజయకృష్ణ మాట్లాడారు.

ఇంగ్లండ్ సంచలనం

సెమీస్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తొలిసారి ఫైనల్‌కు
ఫిఫా మహిళల ప్రపంచకప్

ఆస్ట్రేలియా రక్షణశ్రేణిని ఛేదించి గోల్ కొడుతున్న ఇంగ్లండ్ ప్లేయర్ లారెన్ తొలి గోల్ చేసిన టూనే(ఇన్‌సెట్‌లో); ఫైనల్ చేరిన ఇంగ్లండ్ ఆటగాళ్ల సంబరాలు

సిడ్నీ: ఫిఫా మహిళల ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. ఆతిథ్య ఆస్ట్రేలియాకు ఝలక్ ఇచ్చి ఇంగ్లండ్ మహిళల జట్టు తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇంగ్లండ్ 3-1 గోల్స్ తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. ఇంగ్లండ్ తరఫున లారెన్ హెంప్, ఎల్లా టూనె, అలీసియారుసో ఒక్కో గోల్ కొట్టారు. 'మేము ఫైనల్‌కు వెళ్లామంటే నమ్మశక్యం కావడం లేదు. టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచినంత సంతోషంగా ఉంది. ఈ స్టేడియం నిజంగా ఓ అద్భుతం. ఇది కష్టమైన మ్యాచ్. ఆటగాళ్లంతా గొప్పగా ఆడారు. దాంతో, మా గెలుపు సాధ్యమైంది' అని ఇంగ్లండ్ జట్టు మేనేజర్ సరీనా వీగ్మన్ వెల్లడించారు. ఆట ఆరంభమైన 35వ ని.లో టూనే గోల్ కొట్టింది. దాంతో ఇంగ్లండ్ 1-0తో ఆధిక్యంలోకి నిలిచింది. రెండో అర్ధభాగం 71వ నిమిషంలో ఆస్ట్రేలియా ప్లేయర్ సామ్ కెర్ గోల్ చేయడంతో స్కోర్ 1-1తో సమం అయింది. ఆ తర్వాత లారెన్, అలీసియా వరుస గోల్స్‌తో ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. చివర్లో ఆతిథ్య ఆసీస్ జట్టు ఎంత ప్రయత్నించినా గోల్ చేయలేకపోయింది. దాంతో, సొంత గడ్డపై ఫైనల్ చేరాలన్న ఆసీస్ కలలు అడియాశలయ్యాయి. ఇంగ్లండ్, స్పెయిన్ జట్లు ఆగస్టు ఆదివారం (20న) టైటిల్ పోరు జరగనుండగా.. 3వ స్థానం కోసం ఆస్ట్రేలియా-స్వీడన్ జట్ల మధ్య శనివారం పోటీ జరగనుంది.

వైభవంగా ఎపిఎల్-2 ప్రారంభం

కోస్టల్ రైడర్స్ బోణి

ప్రజాశక్తి -పిఎం పాలెం (విశాఖపట్నం)

వైజాగ్ వేదికగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ -2 బుధవారం వైభవంగా ప్రారంభమైంది. సినీ హీరోయిన్ శ్రీలీల గౌరవ అతిథిగా హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు.

తలపడుతున్న కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్ క్రీడాకారులు

తలపడిన కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్

పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వేదికగా ప్రారంభమైన ఎపిఎల్ లీగ్ మ్యాచ్‌లో మొదటిగా కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్ టీమ్‌లు తలపడ్డాయి. 12 పరుగుల తేడాతో కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటగా టాస్ గెలిచిన బెజవాడ టైగర్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగారు. బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ జట్టు 20 ఓవర్లలో 149 పరుగులు చేసి ఎనిమిది టికెట్లు కోల్పోయింది. చివరలో లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్లు ఎల్ రెడ్డి, పి.మనోహర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడి 16 బంతుల్లో 26 పరుగులు చేశారు. ఓపెనర్లు నిరుత్సాహపరిచినా మిడిల్ ఆర్డర్ ప్లేయర్లు స్కోర్‌ను పెంచుకుంటూ ముందుకు సాగారు. బెజవాడ టైగర్స్ బౌలర్లు కె.సాయితేజ నాలుగు ఓవర్లలో రెండు వికెట్లు తీసి 41 పరుగులు ఇచ్చాడు. మోహన్ నాలుగు ఓవర్లకు 30 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 137 పరుగులకే ఆల్ అవుట్ అయింది. మిడిల్ ఆర్డర్‌లో ఎం.అభినవ్ 44 బంతులలో మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో 57 పరుగులు చేశాడు. బెజవాడ టైగర్స్ కెప్టెన్ రిక్కీ బుయి మూడు పరుగులు చేసి నిరుత్సాహపరిచాడు. కోస్టల్ రైడర్స్ బౌలర్లు స్టీఫెన్, కె.సుదర్శన్, ఆశిష్, మనోహర్ ఒక్కొక్కరు రెండేసి వికెట్లు చొప్పున ఎనిమిది వికెట్లు తీశారు. 24 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మనోహర్ నిలిచాడు.

ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ (విశాఖ)

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో 50వ ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ -2023 పోటీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు విశాఖలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించడానికి ఉచితంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ఇది రెండో అతి పెద్ద వేదిక అని, ఎంతోమంది క్రీడాకారులు ఈ క్రీడల్లో ఉత్తమ ప్రదర్శనతో జాతీయ జట్టులో చోటు పొందారని తెలిపారు. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎస్‌హెచ్ కమలేష్ మెహతా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల తరుపున ఈవెంట్స్‌లో మొత్తం 16 పురుషుల జట్లు, 13 మహిళల జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్ రాజారెడ్డి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ జిఎల్ వర్మ, టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68